
ఈనాడు అనంతపురం

శనివారం సెప్టెంబరు 28, 2024

జిల్లాకు 2 వేల టన్నుల జొన్నలు

రేషన్ కార్డుదారులకు గరిష్ఠంగా 3 కిలోల పంపిణీ

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలో చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు గరిష్ఠంగా 3 కిలోల వరకు ప్రభుత్వం ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లాకు 2 వేల టన్నులు జొన్నలు నంద్యాల జిల్లా నుంచి సరఫరా చేశారని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని 12 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకధరల దుకాణాలకు జొన్నలు రవాణా చేశామన్నారు. ఒక కిలో బియ్యానికి బదులు ఒక కిలో చొప్పున 3 కిలోల వరకు జొన్నలు కార్డుదారులు తీసుకోవచ్చన్నారు. ఆహార అలవాట్లు మార్పులో భాగంగా చిరుధాన్యాలు ఆహారంగా తినాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్డుదారులంతా జొన్నలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అక్టోబరు నెలకు 720 మెట్రిక్ టన్నులు కందిపప్పు అవసరం కాగా 400 మెట్రిక్ టన్నులు కందిపప్పు జిల్లాకు కేటాయించారని, పంచదార, బియ్యం కూడా కార్డుదారులకు పంపిణీ చేస్తామని డీఎం తెలిపారు. .



మైదానం అనుకుంటే పొరపాటే..

బుక్కరాయసముద్రం మండలకేంద్రంతో పాటు పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు చిక్కవడయార్ చెరువులో శ్రీసత్యసాయి తాగునీటి పథకం కింద ట్యాంకు ఏర్పాటు చేశారు. దీనికి హెచ్చెల్సీ కాలువ ద్వారా నీరు నిల్వ చేసి సరఫరా చేసేవారు. ఈసారి హెచ్చెల్సీ నీరు రాక ఆలస్యం కావడంతో ట్యాంకు ఒట్టిపోయి.. మైదానంలా కనిపిస్తోంది.

– ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్

పరిశ్రమలతో ఉపాధి కల్పనపై దృష్టి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠ పరచాలి. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి విరివిగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే బాధ్యత మనపై ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో 50వ జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని విధాల సదుపాయాలు, ప్రోత్సాహం కల్పిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఉత్పత్తి, సేవా, వాణిజ్య రంగాల్లో అన్నివిధాల సహకారం ఉంటుందని, ఏకగావాక్ష విధానం ద్వారా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కాలుష్య, అగ్నిమాపక, ఫ్యాక్టరీస్ వంటి అనుమతులు వేగంగా ఇప్పిస్తామన్నారు. జిల్లాలో వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణకు బదలాయిస్తామని చెప్పారు. జేసీ శివనారాయణ శర్మ, జిల్లా పరిశ్రమల ఇన్‌ఛార్జి అధికారి రాజశేఖర్ రెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, నగర కమిషనర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రమాదాల బ్లాక్‌స్పాట్లపై నిఘా

జిల్లాలో రహదారుల భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో 37 చోట్ల ప్రమాదాల బ్లాక్ స్పాట్లుగా గుర్తించామన్నారు. ఎస్పీ జగదీశ్‌తో కలిసి ఆయన జిల్లా స్థాయి రహదారుల భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రహదారుల ప్రమాదాలను పూర్తిగా నియంత్రించాలని వారు అన్నారు. బ్లాక్ స్పాట్లలో విద్యుత్తు దీపాలు, బోర్డు, సిగ్నల్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలన్నారు. అనంత నగరంలో 40 చోట్ల సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు.



పురస్కారాన్ని చూపుతున్న జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు, ఓఎస్‌డీ దేవన్న, రిజిస్ట్రార్ కృష్ణయ్య

జేఎన్‌టీయూకు జాతీయస్థాయి పురస్కారం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకు 'మేకింగ్ ఇండియా ఎంప్లాయబుల్' పురస్కారం దక్కిందని ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు తెలిపారు. ముంబయిలో ఇండియా ఎంప్లాయర్ ఫోరం, ఇండియా ఎడ్యుకేషన్ ఫోరం సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో పురస్కారాన్ని ప్రదానం చేశారు. జేఎన్‌టీయూలో వర్సిటీ డేటా ఆధారంగా పురస్కారాన్ని ప్రకటించారు. డీఏపీ డైరెక్టర్ ఆచార్య ఎస్‌వీ సత్యనారాయణ ముంబయిలో ఈ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు జేఎన్‌టీయూలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి.. డీఏపీ డైరెక్టర్‌కు అందజేశారు. ఓఎస్‌డీ దేవన్న, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, డైరెక్టర్లు భానుమూర్తి, సుజాత, విశాలి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

అనంత జ్వరకంపితం!

అనంతపురం (వైద్యం), పుట్టపర్తి, న్యూస్‌టుడే

ఉమ్మడి అనంత జిల్లాలో రోజురోజుకు జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వరపీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. వాతావరణంలో మార్పులు, నీరు కలుషితం, పారిశుద్ధ్యలోపం తదితర కారణాలతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఆసుపత్రుల బాట పట్టాల్సి వస్తోంది. ఎక్కువ మంది జ్వరంతోపాటు దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. మున్సిపల్, పంచాయతీ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో పని చేస్తేనే క్షేత్రస్థాయిలో జ్వరాల నివారణకు సాధ్యమవుతుంది. చాలా చోట్ల దోమల నివారణకు ఫాగింగ్ ప్రక్రియ చేపట్టడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


లక్షణాలు ఉంటే వైద్యుడిని సంప్రదించాలి

– ప్రవీణ్‌దీన్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

శరీరంపై ఎర్రటి మచ్చలు, వాంతులు, కడుపు నొప్పి, నీరసంగా ఉన్నట్లు అనిపించటం, ఆకలి తగ్గిపోవటం, దగ్గు, జలుబు, రెండు రోజుల్లో జ్వరం తగ్గి.. తిరిగి రావడం.. తదితర లక్షణాలు పెద్దల్లో కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. చిన్నిపిల్లల విషయానికి వస్తే నీరసం, నిద్ర పోకపోవడం, దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించి.. చికిత్స పొందాలి. దోమల నివారణకు ఇంట్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తాగునీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.




అనంతపురం సర్వజన వైద్యశాల పీడియాట్రిక్ విభాగంలో జ్వరం బారిన పడిన చిన్నారులు



మూడు నెలల్లో 73,886 కేసులు గుర్తింపు

ఉమ్మడి జిల్లాలో జులై, ఆగస్టుతోపాటు ఈనెలలో ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి 73,886 జ్వరపీడితులను గుర్తించారు. 23,888 మందికి వారం రోజులైనా జ్వరం తగ్గకపోవటంతో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 13,119 మంది వైద్యసేవలు (ఓపీ) పొందారు. ప్రస్తుతం అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ విభాగాల్లో 80 మంది చికిత్స పొందుతున్నారు. ఇందులో చిన్నపిల్లలు 40 మంది ఉన్నారు. ఆరు డెంగీ కేసులు నమోదయ్యాయి. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.





బాధితులను గుర్తించి వైద్యసేవలు అందిస్తాం

– ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో, అనంతపురం

ఇంటింటా సర్వేలో జ్వరబాధితులను గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్యసేవలు పొందాలి. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో పని చేస్తున్నాం. ప్రతి వారం డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయడం నిబంధనలకు విరుద్ధం. రక్త నమూనా తీసి.. డీఎంహెచ్‌వో కార్యాలయ అనుమతితో సర్వజన వైద్యశాలకు పంపాలి. అక్కడ నిర్వహించే పరీక్షలో పాజిటివ్ వస్తేనే డెంగీగా నిర్ధారించాలి. కిట్లతో పరీక్ష చేసి, డెంగీ ఉందని రోగులకు చెప్పి.. వైద్యం చేస్తే సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

ఆత్మస్థైర్యం, ఆధ్యాత్మిక చింతన

ఉచితంగా భగవద్గీత పుస్తకాల పంపిణీ



సిద్ధంగా పుస్తకాల పెట్టెలు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, మానసిక స్థైర్యం నింపేందుకు 'మానవులందరికీ భగవద్గీత' పేరుతో పుస్తకాన్ని అందించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ విభాగం శ్రీకారం చుట్టింది. భగవద్గీత నేటి కంప్యూటర్ యుగంలో కూడా గొప్ప ప్రేరణ ఇస్తుంది. ఉరుకులు పరుగుల జీవితంలో యాంత్రిక విధానానికి అలవాటు పడిన నేటి తరుణంలో ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం పొందవచ్చు. నిత్యం మార్కుల కోసం బట్టీ కొడుతూ కుస్తీ పడే విద్యార్థుల ఒత్తిడిని అధిగమించే ఆయుధంగా కావాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ఉచితంగా అందివ్వాలని నిర్ణయించారు. ఓ వైపు ప్రపంచీకరణ, చరవాణి మాయలో పడి పోతున్న నేటి తరానికి సనాతన ధర్మాలు వివరించేందుకు చుక్కానిలా ఉంటుందని నిర్ణయించారు.

ఇరు జిల్లాలకు 1.90 లక్షల పుస్తకాలు

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. రెండు జిల్లాలకు 1.90 లక్షల పుస్తకాలు అందాయి. అనంతపురంలోని టీటీడీ లోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ అనంతపురం జిల్లా శాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. పుస్తకాలను బాక్సుల్లో పంపారు. ఒక్కో బాక్సులో 500 పుస్తకాల చొప్పున మొత్తం 386 బాక్సులను తితిదే నుంచి అనంతకు పంపారు.

● 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఆయా పాఠశాలల ప్రతినిధులు ఎంత మంది విద్యార్థులు ఉన్నారో ఆ వివరాలు అందిస్తే ఆమేరకు సరఫరా చేయనున్నారు. జిల్లాలోని ఆసక్తి కనబరచిన అన్ని పాఠశాలలకు ఇవ్వాలని నిర్ణయించామని అధికారులు చెబుతున్నారు.

రూ.3 కోట్లతో రహదారి.. మూడేళ్లకే కుంగి!



బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఉన్న కొండమీదరాయుడి దేవాలయం చేరుకోవటానికి మూడేళ్ల కిందట వేసిన సీసీ రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి కింద మట్టి కోతకు గురై కుంగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కొన్ని చోట్ల గుట్ట మట్టి రహదారి పైకి చేరి ప్రమాదకరంగా మారింది. రహదారి పనులను వైకాపా మాజీ ఎమ్మెల్యే బంధువు దక్కించుకొని సుమారు రూ.3 కోట్లతో పూర్తి చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న విమర్శలు ఉన్నాయి.

- ఈనాడు, అనంతపురం

ఆరోగ్యేతర విధులు వద్దంటూ ఏపీ ఎన్జీఓ నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఆరోగ్య శాఖ విధులకు పరిమితం చేయాలి. పింఛన్ల పంపిణీ, ఇతర శాఖల సర్వేలు.. వంటి సంబంధంలేని ఆరోగ్యేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ ఏపీ ఎన్జీఓ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం సారథ్యంలో అనంత కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఆ తర్వాత కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి ఏఎన్ఎం సమస్యలను వివరించారు. ఆరోగ్య శాఖ పరిధిలోనే అనేక యాప్, ఇతరాత్ర సర్వేలు, వివరాల సేకరణ.. వంటి పని ఒత్తిడితోనే సతమతం అవుతున్నారని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రమోహన్ అన్నారు. పింఛన్ల పంపిణీ, బీఎల్ఓ విధులు పనులు కేటాయించొద్దన్నారు.

కబ్జా భూమిలో రాళ్ల తొలగింపు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కరిడికొండ రెవెన్యూ పంచాయతీ పరిధిలోని బాచుపల్లిలో కొందరు నాయకులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి రాళ్లు నాటారు. దీనిపై 'ఈనాడు' 'సర్కారు భూముల్లో రియల్‌దందా' అనే శీర్షికన ఈనెల 26న ఇచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గుత్తి తహసీల్దారు ఓబులేసు, రెవెన్యూ సిబ్బంది స్పందించి శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కబ్జా చేసిన ప్రభుత్వ భూమిలో రాళ్లను తొలగించి ప్రభుత్వ స్థలమని హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు.



బోర్డు ఏర్పాటు చేసిన తహసీల్దారు ఓబులేసు, సిబ్బంది

ఒక్క క్లిక్‌తో ఉపాధి సమాచారం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే

జాతీయ మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ రేగా యాప్‌ను తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా సమగ్ర వివరాలు తక్షణమే తెలుసుకునే వీలుంది. కూలీలు ఇప్పటి వరకు ఏ సమాచారం కావాలన్నా ఎంపీడీవో, తపాలా కార్యాలయాలు, ఉపాధి సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ఇక నుంచి ఆ అవసరమే ఉండదు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ అరచేతిలో సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు.


ఏ ఏ వివరాలు ఉంటాయంటే..

సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లో జన్‌మన్ రేగా (జేఏఎన్ఎంఏఎన్ఆర్ఈజీఏ) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వివరాలు, హాజరు, వేతనాలు తదితర వివరాలు క్లిక్ చేస్తే బ్లాక్ తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, కూలి మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయింది, ఎంత జమ అయిందో పూర్తి వివరాలు కనిపిస్తాయి. ఒక వేళ వేతనదారుడికి నగదు జమ కాకపోతే కారణాలు స్పష్టంగా కనిపిస్తాయి. దాంతోపాటు ఉపాధి పథకంలో చేపట్టే పనుల వివరాలు, సమాచారం ఉంటుంది.

అందుబాటులో జన్‌మన్ రేగా యాప్

అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు

ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేసినా, ఉపాధి సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా ఫిర్యాదు చేయవచ్చు. ఈ వివరాలు అన్ని భాషల్లోనూ అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది.





యాప్ ముఖచిత్రం

అవగాహన అవసరం..

జన్‌మన్ రేగా యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. యాప్ అందుబాటులో ఉన్న విషయం చాలా మందికి తెలియదు. ఉపాధి హామీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనులు చేసే చోట కూలీలకు అవగాహన కల్పిస్తే ఉపయుక్తంగా మారనుంది.

రమణీయత రంగరించి

● అందుబాటులో చేనేత వస్త్రాలు ● అనంత నేతబజారులో కొత్త దుకాణ సముదాయం



అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: చేనేతలకు చేయూత నిచ్చే ఆప్కో దుకాణాల్లో అన్ని రకాల వస్త్రాలను అమ్మకాలు చేస్తున్నారు. మహిళలు ఇష్టపడే చీరలతో పాటు, పంచలు, టవళ్లు, లుంగీలు అందుబాటులో ఉంచారు. అనంత నగరం టవర్‌క్లాక్ సమీపంలోని నేత బజార్‌లో ఆప్కో దుకాణ భవన సముదాయాన్ని కొత్తగా నిర్మించారు. ధర్మవరం పట్టు చీరలు, బందరు, రాజమండ్రి, ఉప్పాడ, మాధవరం, మంగళగిరి, కాటన్, సిల్క్, చీరలు, వీటితో పాటు పొందూరు పంచలు, శ్రీకాకుళం టవళ్లు, కర్నూలు తెల్ల పంచలు విజయనగరం మంచం నవారు అందుబాటులో ఉన్నాయి.



పట్టుచీరలు చూపిస్తున్న మహిళలు

చేనేతలకు ఉపాధి కల్పించాలి


వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న చేనేతలకు ఉపాధి కల్పించాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలి. చేనేత వస్త్రాలు ధరించాలి. ప్రస్తుతం 30 శాతం రాయితీతో అందిస్తున్నాం. పండగలు ఇతరత్రా సమయాల్లో 50 శాతం రాయితీ ఉంటుందన్నారు.

- పవన్, మేనేజర్

అనిశాలో స్తబ్దత

● మూడేళ్లలో కేవలం 20 కేసులు

● అవినీతిపరుల కూపీ లాగడంలో వెనుకంజ



అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో అవినీతి అధికారుల అవినీతి కేసులు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులను వెలికితీసి పట్టుకోవడంలో అవినీతి నిరోధక శాఖ వెనకబడుతోంది. కొందరు అధికారులు పెద్ద ఎత్తున లంచాలు తీసుకుంటూ అవినీతి పాల్పడుతున్నా, ప్రతి పనికి చేతులు చాస్తున్నా ఆగడాలను అరికట్టే రీతిలో అనిశా పాత్ర పోషించలేదని విమర్శలు వస్తున్నాయి.

● రెవెన్యూ, పోలీసు, రిజిస్ట్రార్, విద్యుత్, వ్యవసాయ శాఖలో లంచాల జాడ్యం అధికం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2022 జనవరి నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 25 వరకు కేవలం 20 కేసులు నమోదు అయ్యాయి. వాటిలో రెవెన్యూలో 6, పోలీసు శాఖలో 4, స్టాంపులు, రిజిస్టర్ శాఖలో 4, సంక్షేమశాఖ, కమర్షియల్ ట్యాక్స్, వ్యవసాయం, విద్యుత్, విద్యాశాఖలో ఒక్కోటి చొప్పున కేసులు ఉన్నాయి. ఒక కేసులో ఏకంగా రిజిస్టర్, పోలీసు, రెవెన్యూ అధికారులు నిందితులుగా ఉన్నారు. 2022లో 6, 2023లో 7, 2024లో 7 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో 15 కేసులు బాధితులు ఫిర్యాదు చేయడం వల్ల ట్రాప్ చేసి పట్టుకున్నవే. మరో 5 కేసులు స్టాంపులు, రిజిస్టర్ శాఖపై చేసినవి.

దొరికిపోయినా దర్జాగా బయటకు

● కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో 2022 జనవరిలో ఓ సర్వేయర్ భూమి కొలతలు వేయడానికి ఓ మహిళా రైతును లంచం డిమాండ్ చేసి దొరికిపోయాడు. అతనిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఏం జరిగిందో తెలియదు గానీ, రెండేళ్ల లోపే పోస్టింగ్ తెచ్చుకుని ప్రస్తుతం కడప జిల్లాలో దర్జాగా ఉద్యోగం చేస్తున్నాడు. అదే ఏడాది డిసెంబరులో భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రెవెన్యూ, పోలీసు, రిజిస్టర్ అధికారులపై అనిశా కేసులు నమోదు చేసింది. వారిలో ఓ పోలీసు అధికారి ఆ కేసు నుంచి బయటపడి ఉద్యోగంలో చేరాడు. మిగతా శాఖల అధికారులూ పోస్టింగులు తెచ్చుకున్నారు.

వీగిపోతున్న కేసులు

నిబంధనల ప్రకారం ట్రాప్ కేసుల్లో దొరికిపోయిన వారిపై 3 నెలల్లో, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆరు నెలల్లో, అనిశా నివేదికపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ నెలల తరబడి విచారణ సాగుతూనే ఉంటోంది. ఈ లోపు సర్వీసు నిబంధనల వంకతో, రాజకీయ ప్రాబల్యంతో ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరుతున్నారు.

ప్రతిదానికో రేటు

ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ విభాగంలో అవినీతి అధికారులు పెచ్చరిల్లిపోతున్నారు. భూమి వివరాలను ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటే వీఆర్వో, భూమి కొలతలు వేయడానికి సర్వేయర్లు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారు. ఈ ఏడాది జులైలో వజ్రకరూరు మండలం తహసీల్దార్.. ఓ రైతుకు చెందిన భూమిని ఆన్‌లైన్‌కు ఎక్కించడానికి భారీ మొత్తం డిమాండ్ చేసి పట్టుబడ్డాడు. పామిడి మండలం ఆర్ఐ కూడా లంచం తీసుకుంటూ దొరికాడు. రైతులకు వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి, మెటీరియల్ తొందరగా ఇవ్వడానికి సైతం లంచాలు దండుకుంటున్నా చర్యల్లేవు.

మూడేళ్లుగా ఇన్‌ఛార్జి డీఎస్పీనే..

అనంతపురం అనిశా కార్యాలయానికి మూడేళ్లుగా పూర్తి స్థాయి డీఎస్పీ పోస్టింగ్ లేదు. చివరగా 2021లో ఇక్కడ పనిచేస్తున్న కులశేఖర్ అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది తిరుపతికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగా ఉంది. కొన్నిరోజులపాటు కర్నూలు, ఒంగోలు డీఎస్పీలు ఇన్‌ఛార్జిగా పనిచేశారు. ప్రస్తుతం తిరుపతిలో పనిచేస్తున్న ప్రశాంతి ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. పాలనాపరంగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆరు ఇన్‌స్పెక్టర్ పోస్టులు నియమించాల్సి ఉండగా, కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్సైలతోనే విధులు నిర్వహిస్తున్నారు.



నిర్వాహకుడిని హెచ్చరిస్తున్న డీఎంహెచ్‌వో ఈ.బి.దేవి

ప్రైవేటు క్లినిక్‌ల సీజ్

రాయదుర్గం పట్టణం, అనంతపురం (వైద్యం): ఆయుర్వేదిక్ కోర్సు చేసి ఆ మేరకు ప్రజలకు వైద్యం అందించకుండా అల్లోపతి వైద్యం అందిస్తున్న మూడు క్లినిక్‌లను ఎట్టకేలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ఈ ఏడాది జూన్ 10న 'ఈనాడు'లో 'చదివింది ఒకటి.. చేసే వైద్యం మరొకటి!' కథనం ప్రచురితమైంది. అధికారులు ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. కొన్ని రోజుల తరువాత సంజాయిషీ ఇచ్చారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈనెల 26న 'నిబంధనలు చూడరు.. అనుమతులు ప్రశ్నించరు!' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో ఈ.బి. దేవిని ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో, డెమో త్యాగరాజు, హెచ్‌ఈవో గంగాధర్ సిబ్బందితో కలిసి రాయదుర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ క్లినిక్‌లను పరిశీలించారు. కేర్, బిశ్వాస్, సైనిక్ ప్రైవేట్ క్లినిక్‌లను తనిఖీ చేసి సీజ్ చేశారు. భూమిక ఫిజియోథెరపీ క్లినిక్ యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు.

'లేపాక్షి' భూములను రైతులకు అప్పగించాలి

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను రైతులకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీశ్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం సాయిఆరామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చిలమత్తూరు మండలం లేపాక్షి ప్రాంతంలో 8,844 ఎకరాలను కొనుగోలు చేశారు. పరిశ్రమలు స్థాపించి లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన అప్పటి ప్రభుత్వం భూములను తాకట్టు పెట్టి బ్యాంకులను లూటీ చేసిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, ఆంజనేయులు, మహేదవ, కమతం కాటమయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17 పాఠశాల క్రీడల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను శుక్రవారం ఎంపిక చేశారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో సత్తాచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పాఠశాల క్రీడల సమాఖ్య అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కార్యదర్శులు బి. సుగుణమ్మ, డి. మొరార్జీ యాదవ్, పీడీలు అక్కులప్ప, వేణుగోపాల్, జగదీశ్వరయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, తిమ్మరాజు, బాలకృష్ణ సమక్షంలో క్రీడాకారుల ఎంపిక జరిగింది.

అండర్-17 బాలుర జట్టు: టి.రాజేష్, కె. ముఖేష్ (100 మీ. పరుగు), డి.హరిశంకర్, డి. శశికాంత్ (200 మీ. పరుగు), హరిశంకర్, టి. రాజేష్ (400 మీ. పరుగు), యశంత్, పవన్ (3వేల మీ. పరుగు), డి.నరసింహారెడ్డి, సుదర్శన్ (లాంగ్‌జంప్), వి.సిద్ధార్థ, వై.బన్నీ (హైజంప్), డి.వసంత్, బి.దేవేంద్ర నాయక్ (షాట్‌పుట్), హేమంత్ కుమార్, మధు (5వేల మీ. నడక).

బాలికల జట్టు: హెచ్.అర్చన, ఎస్.లక్ష్మీ (100 మీ. పరుగు), జి.యశస్విని, ఎ.ఇంద్రలేఖ (200 మీ. పరుగు), ఎ.ఇంద్రలేఖ, సి.ఉదయశ్రీ (400 మీ. పరుగు), డి.సమీరా, హరిణి (3వేల మీ. పరుగు), జి.యశస్విని, ఆర్.మానస (లాంగ్ జంప్), డి.హర్ష, ఎం.వాణి (హైజంప్), వి.సరస్వతి, రమ్యశ్రీ (షాట్‌పుట్), సి.మౌనిక, హెచ్. వర్షిత (3వేల మీ. నడక), లాస్యరెడ్డి, ఉదయశ్రీ (800 మీ. పరుగు).

దేశ ప్రగతికి పర్యాటక రంగం కీలకం

లెక్చరర్స్‌కాలనీ (అనంత గ్రామీణం): వైకాపా ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న పర్యాటక రంగాన్ని పునరుద్ధరించడానికి అన్ని చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. అనేక దేశాలు పర్యాటక రంగంపైనే ఆధారపడి ప్రగతి సాధిస్తున్నాయి. మన జిల్లాలో అనేక పర్యాటక స్థలాలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. శుక్రవారం శిల్పారామంలో పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ, సహాయ కలెక్టర్ బి. వినూత్న, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీవీఈఓ వెంకటరమణ నాయక్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్ బాబు, అనంతపురం తహశీల్దారు హరికుమార్ పాల్గొని ప్రసంగించారు. ఎంపీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో హరిత హోటళ్లు, టూరిజం రెస్టారెంట్స్, పురాతన పర్యాటక స్థలాలు దీనస్థితికి చేరాయని ఆరోపించారు. శ్రీ కృష్ణదేవరాయల కాలంనాటి దేవాలయాలు, చెరువులను కాపాడుకుని చరిత్రను పిల్లలకు చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. శిల్పారామానికి పూర్వవైభవం తీసుకురావడానికి రూ. 10 కోట్ల నిధులు సీఎంను కోరామని తెలిపారు. నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడానికి కృషి చేస్తామన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని పామిడి సమీపంలో అనంత గజగరుడ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో శేష శిల్పకళ ఉన్నట్లు జిల్లా వాసులకే తెలియదన్నారు. అలాంటి దేవాలయాలను వెలుగులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు పర్యాటకుల సంఖ్య పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి బహుమతులు అతిథులు ప్రదానం చేశారు.



బహుమతులు అందుకున్న విజేతలతో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, తదితరులు

రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో చిరు జల్లులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్‌బాబు, నారాయణస్వామి తెలిపారు. వచ్చే ఐదు రోజులూ పగటి ఉష్ణోగ్రతలు 33.6 నుంచి 37.0 డిగ్రీలుగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు 24.4 నుంచి 26.5 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 8 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 81 శాతం, మధ్యాహ్నం పూట 48 శాతం ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలైన ఉలవ, పెసర, అలసంద, జొన్న, కొర్ర తదితర పంటలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారు.

సగం ధరకే సరకు పేరిట మోసం

వ్యాపారిని బెదిరించి రూ.6 లక్షలతో ఉడాయింపు

నల్లమాడ, న్యూస్‌టుడే: 'సగం ధరకే దుకాణంలో వస్తువులన్నీ ఇచ్చేస్తున్నారు. వారికి డబ్బు అత్యవసరం. సగం డబ్బిస్తే చాలు రూ. 20 లక్షల సరకు సొంతం అవుతుంది' అని చెప్పడంతో ఓ వ్యాపారి ఆశపడ్డాడు. చివరికి కేటుగాళ్ల చేతిలో చిక్కి మోసపోయాడు. నిందితులు పక్కా ప్రణాళిక ప్రకారం కర్ణాటక రాష్ట్రం దావణగిరి తీసుకెళ్లి రూ.6 లక్షలు స్వాహా చేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల మేరకు..నల్లమాడకు చెందిన పవన్ ఎలక్ట్రానిక్ వస్తువుల దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. కొంతకాలం కిందట బెంగళూరు బేకరీకి చెందిన యోగి దుకాణంలో కొన్ని వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చి పరిచయమయ్యాడు. అతడు తన బంధువును తీసుకొచ్చి అదే దుకాణంలో మరికొన్ని వస్తువులు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో పవన్‌తో ఇద్దరు మాట కలిపారు. కర్ణాటక రాష్ట్రం దావణగెరె ప్రాంతంలో ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించిన పెద్ద షాపు తొలగిస్తున్నారు. అందులోని వస్తువుల విలువ రూ.20 లక్షలు ఉంటుందని చెప్పారు. రూ.10 లక్షలు ఇస్తే సరకు మొత్తం ఇచ్చేస్తారని నమ్మించారు. ఒక రోజు వీడియో కాల్ చేసి దుకాణంలోని వస్తువులు ఇవేనని చూపించారు. పెద్ద మొత్తంలో సరకు సగం ధరకే దక్కుతుందని పవన్ ఆశపడ్డారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన స్నేహితుడిని వెంటబెట్టుకుని ఈ నెల 26న రూ.6 లక్షలు తీసుకొని కారులో దావణగెరె వెళ్లారు. అప్పటికే అక్కడ ప్రణాళిక రచించిన నిందితులు మారణాయుధాలతో వ్యాపారితో పాటు స్నేహితుడిని బెదిరించి రూ.6 లక్షలతో ఉడాయించారు. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు నల్లమాడకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పర్యాటకశాఖ ఉత్తమ గైడ్‌గా విరూపన్న

లేపాక్షి: రాష్ట్ర ఉత్తమ పర్యాటక శాఖ గైడ్‌గా 2023-24 సంవత్సరానికి గాను శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షికి చెందిన విరూపన్న ఎంపికయ్యారు. ఈయన 2004 నుంచి ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో గైడ్‌గా పని చేస్తున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోనే ఒకే ఒక్క గైడ్‌గా మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.



మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న విరూపన్న

బాలికపై వీఆర్‌ఏ అత్యాచారయత్నం

పుట్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని శనగలగూడూరు గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న తిరుపాలు ఓ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు ఆరో తరగతి చదువుతున్న బాలిక పాఠశాలకు వెళ్లే క్రమంలో మాయమాటలు చెప్పి ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశాడు. స్థానికులు వీఆర్‌ఏను పట్టుకొని దాడి చేశారు. బాలిక పాఠశాలలో ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేసింది. అనంతరం తల్లిదండ్రులకు విషయం తెలియడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. తిరుపాలు ప్రవర్తన గతంలో కూడా బాగాలేదని అధికారులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాత్రి ఓ సామాజిక వర్గానికి చెందిన వారిపై బాలిక కుటుంబసభ్యులు, బంధువులు దాడికి యత్నించగా, పోలీసులు అడ్డుకొని శాంతింపచేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ హేమాద్రి పేర్కొన్నారు.



వేధింపులు తట్టుకోలేకపోతున్నా..

● అమ్మానాన్నా క్షమించండి

● లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకుని..

● కదిరిలో యువకుడి బలవన్మరణం



ఉదయ్‌కుమార్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'పోలీసులు, ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతుల తల్లిదండ్రుల వేధింపులు భరించలేకపోతున్నా. అమ్మానాన్నా నన్ను క్షమించండి. నేను చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, లేఖ, సెల్ఫీ వీడియోలో ఉన్న వివరాల మేరకు.. కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్(35) శుక్రవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గతంలో కదిరిలో సీఐగా పని చేసిన మధు, తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీఐ శ్రీనివాస్‌ల వేధింపులతోనే బలవన్మరణానికి పాల్పడుతన్నట్లు అందులో పేర్కొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు హతాశులయ్యారు. మూడేళ్ల తర్వాత ఇలా చూడాల్సి వచ్చిందా నాయనా అంటూ గుండెలవిసేలా రోదించారు. ఉదయ్‌కుమార్ సిద్దిపేటలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. మూడేళ్ల కిందట అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమించాడు. కదిరికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో అతనిపై సిద్దిపేట, కదిరిలో కేసు నమోదైంది. పోలీసులు యువకుడితోపాటు అతడి సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు తమ కుమారుడిని తీవ్రంగా కొట్టారని తల్లిదండ్రులు ఆరోపించారు. వారి దెబ్బలకు చెవి వినికిడి కోల్పోయాడని వాపోయారు.

పోలీసులపై జిల్లా న్యాయస్థానంలో ఫిర్యాదు..

ఉదయ్‌కుమార్ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోలీసులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆ కోపంతో పోలీసులు తమతోపాటు కుమారుడిని వేధింపులకు గురి చేశారని కుటుంబసభ్యులు తెలిపారు. 'కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలంటూ హింసించారు. మీ అంతు చూస్తామంటూ బెదిరించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ దృష్టికి పోలీసుల చర్యలను తీసుకెళ్లాం. పోలీసుల వేధింపులతో ఉదయ్ తెలంగాణలోనే ఉండిపోయాడు' అని చెప్పారు. బాలిక దూరమయ్యాక అతడు తెలంగాణలోని భద్రాచలం, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన ఇద్దరు యువతులను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివిధ కారణాలతో వారిద్దరూ దూరమయ్యారు. పోలీసులు, యువతుల కుటుంబ సభ్యులు బెదిరించడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో, సూసైడ్‌నోట్‌లో పేర్కొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ నారాయణరెడ్డి తెలిపారు.



వృద్ధ రైతుపై సీఐ దాడి



శ్రీనివాసరెడ్డి

పామిడి: కొత్తపల్లి గ్రామానికి చెందిన 70 ఏళ్ల రైతు బంగారు శ్రీనివాసరెడ్డిపై సీఐ యుగంధర్ పత్రికల్లో రాని భాషలో భూతులు తిట్టి దాడి చేశాడు. తనకు జరిగిన అన్యాయాన్ని ఆ రైతు సామాజిక మాధ్యమాల్లో ఓ వీడియోను పోస్ట్ చేశాడు. దీనికి సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైతుకు సంబంధించి ఓ స్థలం వివాదంలో ఉంది. గత సోమవారం తనకు న్యాయం చేయాలని 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును అక్కడి నుంచి పామిడి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈక్రమంలో సీఐ యుగంధర్ శ్రీనివాసరెడ్డి రైతును స్టేషన్‌కు పిలిపించి మొదటగా తనను కలవకుండా ఎస్పీ కార్యాలయానికి ఎందుకు వెళ్లావని దుర్భాలాడుతూ దాడికి పాల్పడ్డాడని, తన చరవాణిని ధ్వంసం చేశాడని బాధితుడు ఆరోపించారు. కనికరం లేకుండా 70 ఏళ్ల వృద్ధాప్యంలో ఉన్న తనపై దాడి చేశాడని కన్నీటిపర్యంతమయ్యారు. సీఐపై జిల్లా ఎస్పీ జగదీశ్ చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు. ఈఘటనపై సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా 2002 నుంచి ఉన్న స్థల వివాదం కావడంతో అగ్రిమెంట్‌తో ఈ సమస్యను కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించాను. ఆయనపై దాడి చేయాల్సిన అవసరం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



వర్ష

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: బీటెక్ విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఠాణా పరిధిలో ఈ ఘటన జరిగింది. సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురానికి చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి నాగరాజు రెండో కుమార్తె వర్ష(19) పటాన్‌చెరు మండలం గీతం విశ్వవిద్యాలయంలో బీటెక్ సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. వర్ష మరో ఇద్దరు విద్యార్థినులతో కలిసి గీతం బాలికల వసతిగృహంలో ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో తాను ఉండే గదిలోకి వెళ్లి ఉరి పోసుకుంది. కొద్దిసేపటికి సహచర విద్యార్థినులు తలుపు ఎంతకొట్టినా తీయకపోవడంతో వాచ్‌మెన్ చూసి తలుపు పగలగొట్టి లోపలకు వెళ్లగా ఫ్యాన్‌కు వర్ష వేలాడుతూ కన్పించింది. వెంటనే కిందకు దింపి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వర్ష ఎప్పుడూ చదువుతూనే ఉండేదని, ఎవరితోనూ మాట్లాడేది కాదని.. ఎప్పుడూ ఒంటరిగానే ఉండేదని సహచర విద్యార్థినులు చెబుతున్నారు. బహుశా ఒత్తిడితో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా అనంతపురం నుంచి వస్తున్నారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి ఎం.రమ్య సూచించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలు 1, 2, బాలుర కళాశాల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లో వంట గదులు, విద్యార్థులు ఉండే గదులను పరిశీలించారు. సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దస్త్రాలు పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని వార్డెన్లకు సూచించారు.

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

మంత్రిని కలిసిన తెదేపా నాయకులు



మంత్రి పయ్యావుల కేశవ్‌తో సర్పంచులు, నాయకులు

విడపనకల్లు (ఉరవకొండ), న్యూస్‌టుడే: విడపనకల్లు మండలంలోని వి.కొత్తకోటకు వెళ్లే రహదారిని ఆధునికీకరించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను తెదేపా నాయకులు కోరారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచిలు చంద్రశేఖర్, తిమ్మరాజు, నాయకులు హనుమంతు, రామంజనేయులు, రంగస్వామి, వన్నూరి శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిశారు. మరమ్మతులు చేయించాల్సిన రహదారుల వివరాలు, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. దశల వారీగా చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించనున్నట్లు మంత్రి తెలిపారు.

నృసింహుని ఆలయ ఈవోగా బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో రమేశ్‌బాబు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పెన్నహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవోగా రమేశ్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విడపనకల్లు మండలం ఉండబండ వీరభద్రస్వామి ఆలయ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. పూర్వ ఈవో విజయ్‌కుమార్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా ఉరవకొండ సబ్‌రిజిస్ట్రార్‌గా హనుమా నాయక్ బాధ్యతలు తీసుకున్నారు. గుత్తి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉప తహసీల్దార్‌గా బోగన గౌడ్ బాధ్యతలు చేపట్టారు. బొమ్మనహాళ్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు..

రాయదుర్గం: రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌గా కె.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా కోసగి నుంచి బదిలీపై రాయదుర్గం వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఈ.శ్రీనివాసులు కదిరికి బదిలీపై వెళ్లారు. ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సురేశ్ ఆచారి పెనుగొండకు, జూనియర్ అసిస్టెంట్ ద్రాక్షాయణి కణేకల్లుకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో డీజీ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ సుచరిత, తాడిపత్రి నుంచి అటెండర్ రాకేశ్ రాయదుర్గానికి బదిలీపై వచ్చారు.

29న పూర్వవిద్యార్థుల కమిటీ ఎన్నిక

కంబదూరు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సేవా సంఘం సభ్యుల నూతన కమిటీ ఈనెల 29న అనంతపురం మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు సేవా సంఘం నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన వారికి, పేద విద్యార్థులకు గత ఐదేళ్లుగా సేవలందిస్తున్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి నూతన కమిటీ ఎన్నిక నిర్వహిస్తున్నామని, పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న అచ్యుత్‌ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈనెల 30న కలెక్టరేట్ ముట్టడి తలపెట్టామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సివిల్‌సప్లైస్ హమాలీలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి చలో కలెక్టరేట్ ముట్టడికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు సమానంగా విధులు నిర్వహిస్తున్నా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు తక్కువగా ఇస్తున్నారన్నారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడికి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రీసర్వేతో రైతులకు కష్టాలు

◆ తప్పుల తడకగా భూముల వివరాలు

ఉరవకొండ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం జగనన్న భూహక్కు, భూరక్ష పథకం పేరుతో తీసుకొచ్చిన రీసర్వే రైతుల పాలిట శాపంగా మారింది. కేవలం ప్రచారమే లక్ష్యంగా సాగిన ఆ పథకం, రైతులకు ప్రయోజనాన్ని చేకూర్చక పోగా కష్టాలనే మిగిల్చింది. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లోని కోనాపురం, వెలిగొండ, మోపిడి, రేణుమాకులపల్లి, ఇంద్రావతి, చిన్న హోతూరు, పొట్టిపాడు, రాగులపాడు గ్రామాల్లో భూముల రీసర్వేను చేపట్టింది. అసమగ్రంగా చేయడంతో భూవివరాల్లో చాలా తప్పులు దొర్లాయి.



రీ సర్వే చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

ప్రభుత్వం రైతులకు వివిధ రాయితీల వర్తింపుతో పాటు నష్టపరిహారం, బీమా ఇతర సదుపాయాలన్నింటిని ఈ-పంట వివరాల ఆధారంగానే కల్పించనుంది. చాలా మంది రైతుల వివరాలు నమోదు కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

ఈ విషయమై తహసీల్దార్ మహబూబ్‌బాషాను వివరణ కోరగా.. రైతులు తమ దృష్టికి తెచ్చిన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అత్యధిక మంది రైతులకు సంబంధించి వారు పట్టాదారు పుస్తకం ఆధారంగా సాగులో ఉన్న భూమి కంటే తక్కువగా నమోదు చేశారు. కొన్ని గ్రామాల్లో ఒక్కో రైతుకు ఒకటి, రెండు ఎకరాలు తక్కువగా చూపించిన దాఖలాలు ఉన్నాయి.

నియోజకవర్గం: ఉరవకొండ

రీసర్వే జరిగిన మండలాలు: ఉరవకొండ, వజ్రకరూరు


ఎన్ని గ్రామాల్లో: 8

ఎన్ని ఎకరాలు: 17,432

సమస్యలు: భూవివరాలు తప్పుగా నమోదు కావడం, ఆన్‌లైన్‌లో కనిపించక పోవడం.

● దాదాపు వందేళ్లుగా అనుభవంలో ఉన్న భూములు సైతం ఇనామం, దేవాలయ భూములుగా నమోదు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో చాలా మంది రైతులకు చెందిన భూవివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు.

● ప్రభుత్వం ఈ-పంట నమోదును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఆన్‌లైన్‌లో భూముల వివరాలు కనిపించక పోవడంతో పంటల నమోదు సాధ్యం కాలేదు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు ఎర్రిస్వామి. ఉరవకొండ మండలం ఇంద్రావతి. ఈయనకు 3.23 ఎకరాల పొలం ఉంది. రీసర్వే కారణంగా ఆన్‌లైన్‌లో భూవివరాలు కనిపించకుండా పోయాయి. ఈ-పంటతో పాటు పంట రుణం నవీకరణకు ఇబ్బందులు పడ్డాడు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవిస్తున్నాడు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: శ్రీరంగాపురం నుంచి బూదవర్తికి వెళ్లే ప్రధాన రహదారిలో ముళ్లపొదలు పెరిగి ఇబ్బందిగా ఉంది. - **సందీప్, బూదవర్తి**

సమాధానం: వెంటనే చర్యలు తీసుకుంటాం. - **శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి, శ్రీరంగాపురం**

సమస్య: పొట్టిపాడు నుంచి చాయపురం వెళ్లే దారిలో ట్యాంకు నుంచి నీరు లీకేజీ అవుతూ అపరిశుభ్రంగా ఉంది. - **రామాంజనేయులు, పొట్టిపాడు**

సమాధానం: మరుగుని తొలగిస్తాం. - **సుభానీరావు, గ్రామ కార్యదర్శి**

సమస్య: పందికుంట నుంచి జీలేదార్ చెరువుకు వెళ్లే రహదారి గుంతలు ఏర్పడంతో పాటు ముళ్లపొదలతో కప్పేసింది. - **తిమ్మరాజు, పందికుంట**

సమాధానం: ముళ్లపొదలను తొలగించి, గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. - **మణిభూషణ్, పీఆర్ మండల ఇంజినీర్**

సమస్య: నూగేపల్లి నుంచి గొంచిరెడ్డిపల్లికి వెళ్లే మట్టిరోడ్డు కోతకుగురై ఇబ్బందిగా ఉంది. - **లచ్చన్న, గొంచిరెడ్డిపల్లి**

సమాధానం: మట్టివేసి సమస్యను పరిష్కరిస్తాం. - **విజయకృష్ణ, పీఆర్ ఏఈ**

సమస్య: ముష్టూరుకుంట ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. - **తిప్పేస్వామి, ముష్టూరుకుంట**

సమాధానం: పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం. - **కవిత, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: సంతేకొండాపురం నుంచి మామదూరు వెళ్లేదారిలో ముళ్లకంపలతో ఇబ్బందిగా ఉంది. - **ఎర్రిస్వామి, సంతేకొండాపురం**

సమాధానం: తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - **అనిత, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, వెలుగుప్ప, వజ్రకరూరు, బ్రహ్మసముద్రం

పరిసరాల శుభ్రతపై అవగాహన అవసరం



రాయదుర్గం: ప్రతిజ్ఞ చేస్తున్న ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి తదితరులు

రాయదుర్గం, బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్త, దోమల నివారణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప మాట్లాడుతూ.. చెత్తరహిత పట్టణం కోసం విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరు విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రిన్సిపల్ మోహన్‌కుమార్, ఈవోఆర్డీ దాస్ తెలిపారు. జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



బొమ్మనహాళ్: మొక్క నాటుతున్న అధ్యాపకులు, అధికారులు

తెదేపా నాయకుల ఔదార్యం

కణేకల్లు, న్యూస్‌టుడే: కణేకల్లు దిగువ గేరి నుంచి వేదావతి హగరిలో మాల్యం గ్రామానికి తెదేపా నాయకులు దారిని బాగు చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశంతో తెదేపా మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనందరాజు, మరియప్ప, చంద్రశేఖరయ్య, నాగప్ప, రమేష్, చాంద్, మాబు సాబ్, వెంకటేష్ చౌదరి, శరణనగౌడ, ఆశోక్ గౌడ మరమ్మతులు చేయించారు. వేదావతి హగరిలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో ట్రాక్టర్లతో మట్టిని తరలించి పొక్లెయిన్‌తో చదును చేయించారు. మాల్యం గ్రామానికి వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది. కణేకల్లు నుంచి 2 కి.మీ. ఉన్న మాల్యం గ్రామానికి చేరుకోవడానికి వాహనదారులకు హెచ్చెల్సీ వంతెన మీదుగా 7 కి.మీ. చుట్టిరావాల్సిన బెడద తప్పింది. వాహనదారులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తెదేపా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి: డీఎంహెచ్‌వో

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఆవులదట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో ఈ.బి.దేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, దస్త్రాలు పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు మాధవ మోహన్‌కుమార్, రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి గర్భిణులతో మాట్లాడారు. ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.



రాయదుర్గం గ్రామీణం: మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ఈ.బి.దేవి

రాయదుర్గం పట్టణం: లింగ వివక్షత నేరమని డీఎంహెచ్‌వో ఈ.బి.దేవి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కేజీబీవీలో లింగ వివక్షతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బాలికల సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. స్కానింగ్ చేసి, ఆడ, మగ నిర్ధారణ చేయడం నేరమన్నారు. బాల్యవివాహాలు అనర్థాలు, కౌమార బాలికల ఆరోగ్య సమస్యలపై వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారులు త్యాగరాజు, గంగాధర్, వైద్యులు సందీప్, హజరత్, ఆరోగ్య విద్యాబోధకుడు లక్ష్మీనారాయణ, సీడీపీవో పద్మావతి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని వడ్డేపాళ్యం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గోవర్ధన్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈనెల 5న కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు తిమ్మప్ప, బొమ్మయ్య, ఈరప్ప, మంజునాథ, రామకృష్ణలు దుశాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

భూమికి పచ్చాని.. రంగేసినట్టు

తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్‌సీ)కి ఈ ఏడాది సకాలంలో నీరు రావడంతో ఆయకట్టు పరిధిలో పంటల సాగు ఊపందుకుంది. హెచ్ఎల్‌సీ తొమ్మిది, పది ఉప కాలువలు, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) కింద విడపనకల్లు, ఉరవకొండ మండలాల్లో రైతులు ఆయకట్టులో వరి, మిరప, పత్తితో పాటు ఇతరత్రా పంటలను సాగు చేశారు. ఆ మండలాల్లో చాలా గ్రామాల్లో పొలాలు కళకళలాడుతున్నాయి. కూలీలకు చేతినిండా పని లభిస్తుండడంతో తీరిక లేకుండా ఉంటున్నారు. ఈసారి హెచ్ఎల్‌సీ ఆయకట్టులో పంటల సాగు ఆశాజనకంగా ఉంది. ప్రకృతి పూర్తిస్థాయిలో సహకరిస్తే ఈ ఏడాది అన్ని రకాల పంటలు రైతులకు కలిసి రానుంది. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**



కోటగోడ కూలేందుకు సిద్ధం



పట్టణంలోని కోట ముఖ ద్వారం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కోట ముఖద్వారం కింద పట్టణంలోని కోటకు వెళ్లే మార్గం ఉంది. గతంలో మరమ్మతులకు పలుమార్లు రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్ సభ్యులు, పట్టణ ప్రజలు పురావస్తు శాఖాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన కోట ముఖద్వారం ఏర్పాటుకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాయదుర్గం**

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..!

మండలంలోని కొత్తూరు - ఎనుములదొడ్డి వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతం వద్ద రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు కప్పేస్తున్నాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. వారం రోజులుగా వాహనాలు, ఆటోలు, బైకులు ఒకదానికొకటి ఢీకొని పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. మలుపులు అధికంగా ఉన్నా ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. అధికారులు పట్టనట్లు వ్యవహిస్తున్నారని వాహన చోదకులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**



స్థానికులే.. శ్రామికులై



మండలంలోని మోపిడిలో కోటవీధికి వెళ్లే దారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరగడంతో పాటు గుంతలతో అధ్వానంగా ఉండటంతో కాలనీ వాసులే బుధవారం మరమ్మతులు చేసుకున్నారు. మరమ్మతులు చేయించడంలో పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. దారిని శుభ్రంగా రాకపోకలకు వీలుగా చేసుకున్నట్లు స్థానికులు వాపోయారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

వాటర్‌షెడ్ నూతన కమిటీ ఎంపిక



నూతన సభ్యులను సత్కరిస్తున్న నాయకులు, అధికారులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బోరంపల్లి వాటర్‌షెడ్ నూతన కమిటీ ఎంపికైనట్లు శుక్రవారం వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారి శ్రీవిద్య తెలిపారు. రైతు సేవా కేంద్రంలో సర్పంచి శోభారాణి, తెదేపా నాయకుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా రామాంజనేయులు, వైస్ ఛైర్మన్ ఎర్రిస్వామితో పాటు 7 మంది సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాయకులు మారెప్ప, మల్లికార్జున, సర్మాస్, ఆది నారాయణరెడ్డి, గంగిరెడ్డి, గోపాల్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



కుటుంబ సభ్యులతో ట్రస్టు సభ్యులు

శెట్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని కైరేవులో అనారోగ్యంతో మృతిచెందిన తెదేపా కార్యకర్త మహేశ్ కుటుంబానికి కళ్యాణదుర్గం ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ శుక్రవారం రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ పెద్ద మృతితో వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎన్ఆర్ఐ మిత్రులకు తెలిపారు. వారు స్పందించి ఈ సొమ్మును అందజేసినట్లు ఆయన చెప్పారు. మృతుడి కుమార్తె జాహ్నవి పేరుపై తపాలా కార్యాలయంలో ఐదేళ్లపాటు డిపాజిట్ చేయించి పాస్‌బుక్‌ను గ్రామస్థుల సమక్షంలో అందజేశారు. ట్రస్టు ఉప ఛైర్మన్ సురేశ్, ట్రెజరర్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో యువతి మృతదేహం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: కర్ణాటకలోని బళ్లారికి చెందిన ఇందుప్రియ (25) మృతదేహం బొమ్మనహాళ్ సమీపంలో శుక్రవారం లభ్యమైంది. బళ్లారి పోలీసుల కథనం మేరకు వివరాలిలా. బళ్లారి సమీపంలోని బండిహట్టివద్ద హెచ్చెల్సీలో గల్లంతైన ఇందుప్రియ మృతదేహం బొమ్మనహాళ్ సమీపంలోని ఆంధ్ర సరిహద్దులో లభ్యమైంది. గత మంగళవారం అదృశ్యమైనట్లు బళ్లారి మహిళా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు చెప్పారు. వీరేశ్ అనే యువకుడితో కలిసి వెళ్లారని, వీరిమధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నట్లు తెలిపారు. గొడవ పడి కాలువలో దూకిందా, యువకుడే హెచ్చెల్సీ వద్దకు తీసుకెళ్లి తోసేశాడా అనే విషయం విచారణలో తెలియాల్సి ఉంది. యువకుడిది కర్నూలు జిల్లా హాలహర్వి మండలం చింతకుంట సమీపంలోని మల్లికార్జునపల్లికి చెందిన వాడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఇందుప్రియ

భూవివాదంలో ఘర్షణ.. కేసు నమోదు

కంబదూరు: మండలంలోని కర్తనపర్తిలో అనిత, ప్రభావతిల మధ్య భూవివాదంలో తగాదాలు చోటు చేసుకుని ఘర్షణకు దారితీసింది. ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. శుక్రవారం బాధితురాలు అనిత, ప్రభావతి, రవిలపై ఫిర్యాదు చేయగా, మరో బాధితురాలు ప్రభావతి నాగేంద్రతో పాటు మరో 8 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

నిందితుడికి రిమాండ్

బెళుగుప్ప: బాలికను వేధించిన ఘటనలో నిందితుడిన్ని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివ తెలిపారు. గుంతకల్లులో నివాసముంటున్న మైనర్ బాలికను బెళుగుప్ప మండలంలో ఒక తండాకు చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో తరచు వేధిస్తుండటంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బెళుగుప్ప, న్యూస్‌టుడే: పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. కాలువపల్లి సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు గురువారం అర్ధరాత్రి సమాచారం అందటంతో ప్రధాన రహదారి వద్ద వాహనాలు తనఖీలు చేపట్టాగా.. ఆత్మకూరు మండలానికి చెందిన నాలుగు, అనంతపురానికి చెందిన మరో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

ప్రజాభిప్రాయంతో దార్శనిక పత్రం విడుదలకు సన్నద్ధం



సర్వే వివరాలు సేకరిస్తున్న వార్డు సచివాలయ సిబ్బంది

రాయదుర్గం, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ 2047కు ప్రణాళిక సిద్ధం చేసేందుకు స్వర్ణాంధ్ర - 2047 దార్శనిక పత్రం విడుదలకు తెదేపా ప్రభుత్వం సిద్ధమైంది. నవంబరు 1న విడుదలకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. సచివాలయ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి ప్రశ్నల ద్వారా సూచనలు, సలహాలను సేకరిస్తున్నారు.

● సర్వేలో స్పందించిన వారి పేరు, చరవాణి నెంబరు, జిల్లా, 12 ప్రశ్నలకు అభిప్రాయాలు తెలియజేయాలి.

● ప్రభుత్వం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయటం ద్వారా స్వర్ణాంధ్ర-2047 పై ప్రజల ఆలోచనలు, సలహాలను ప్రశ్నల రూపంలో తెలుసుకుంటుంది. పట్టణంలోని 18 వార్డు సచివాలయాల ద్వారా 1800 ఇళ్ల సర్వే చేయాల్సి ఉండగా లక్ష్యాన్ని మించి మూడు వేలకుపైగా చేశారు.

● ఓటీపీతో సలహాలు, సూచనలు తెలపటం ద్వారా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని అధికారులు తెలిపారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగం, ప్రజల సహకారం ఎంతో అవసరం.

● వేగవంతమైన పురోభివృద్ధికి లక్ష్యంగా ప్రైవేట్, ప్రభుత్వ, ప్రజల భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేయడం. సంపదసృష్టి, సుస్థిర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరికం లేని సమాజం దిశగా అడుగులు వేసేందుకు శ్రీకారం చుట్టింది.

● సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ విధానంతో ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించటానికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర యువతలో నైపుణ్యాలను పెంచి ఉపాధి అవకాశాలు లభించేందుకు కార్యాచరణ చేస్తోంది.

ప్రజల సహకారంతో..

స్వర్ణాంధ్ర -2047 సర్వేలో వార్డు కార్యదర్శులు, సిబ్బందికి ప్రజలు సూచనలు, సలహాలను తెలిపి సహకరించారు. సేకరించిన సమాచారంతో రాష్ట్రాభివృద్ధికి రూపొందించనున్న ప్రణాళికలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రజాసహకారంతోనే పూర్తయింది.
-దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ఓపెన్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కంబదూరు, న్యూస్‌టుడే: కంబదూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న ఆఖరు గడువన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రవీంద్రనాథ్, రమణరెడ్డి, వెంకటేశులు, కుల్లాయమ్మ, హేమావతి బాయి, దాక్షాయని, కళావతి, రాజు, రాజేంద్రలతో కలిసి గోడపత్రాలు విడుదల చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రయాణికులకు బస్ షెల్టర్ ఏర్పాటు చేయరూ..!



ఎండలో బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు పక్కన నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతపురం మార్గంలోని ఎన్టీఆర్ కూడలి, బళ్లారి రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం, గాంధీ కూడలి తదితర ప్రాంతాల్లో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు. ఎండ వేడి, వర్షానికి తడుస్తూ దుకాణాల వద్ద నిల్చుకొనేందుకు స్థలం లేక నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. దుకాణాల యజమానులు తమకు అడ్డుగా ఉన్నారని ప్రయాణికులతో గొడవలకు దిగిన సందర్భాలు ఉన్నాయి. బస్సులు వచ్చిన తర్వాత ప్రయాణికులు గుమ్మిగూడటంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఇదేమీ పట్టనట్లు ఆయా శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గుంతకల్లు

ఎమ్మెల్యే సమక్షంతో వాగ్వాదం

అనంతపురం, న్యూస్‌టుడే: నార్పల మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామంలో తాగునీటి సరఫరా ట్యాంకర్ల విషయంలో శుక్రవారం అనంతపురంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ క్యాంపు కార్యాలయం వద్ద సర్పంచి నాగార్జున, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగింది. నడిమిదొడ్డిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో కొన్ని రోజులుగా ట్యాంకర్ల ద్వారా ఎమ్మెల్యే వర్గీయులు నీరు సరఫరా చేస్తున్నారు. దీనికి గాను బిల్లులు మంజూరు చేసే విషయంలో సర్పంచి సహకరించడం లేదనే కారణంగా శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పిలిపించారు. ఈక్రమంలో సర్పంచి, ఎమ్మెల్యే అనుచరులు ఎమ్మెల్యే సమక్షంలోనే వాగ్వాదానికి దిగారు. దీనిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏడీఆర్‌ఎంకు పురస్కారం

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని తిరుపతి రైల్వే స్టేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ టూరిజం రైల్వే స్టేషన్‌గా ఎంపికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా గుంతకల్లు అదనపు డివిజనల్ రైల్వే మేనేజరు సుధాకర్ శుక్రవారం విజయవాడలో పురస్కారాన్ని అందుకున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న ఏడీఆర్‌ఎం సుధాకర్

ప్రాంతీయ ఆసుపత్రిలో మందుల్లేవ్!



రోగులకు అరకొరగా సేవలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులోని రాయ్‌సాహెబ్ మిడతల హంపయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు సరైన సేవలు అందడంలేదు. దీనికి తోడు మందుల కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో చేరిన వారు కొన్ని మందులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. రోజూ ఓపీకి 700 పైగా వివిధ జబ్బులతో బాధపడుతున్న వారు వస్తుంటారు. ఆసుపత్రిలో చికిత్సకు చేరి వైద్యం పొందుతున్న వారు 60 నుంచి 70 మంది దాకా ఉంటారు. ఇది పేరుకే వంద పడకల ఆసుపత్రి. ఇక్కడన్నీ సమస్యలే అని రోగులు ఆరోపిస్తున్నారు. రోగులకు తగ్గట్టుగా సేవలు అందడం లేదు. దీనికి తోడు మందుల కొరత వేధిస్తోంది.

❁ ఇవిగో కొన్ని ఉదాహరణలు

● ఐదు రోజుల కిందట గుంతకల్లుకు చెందిన రేణుకాకు కంటి సమస్య ఉండటంతో ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంది. మందులు రాసిచ్చారు. ఆ మందులు లేకపోవడంతో బయట తెచ్చుకోవాలని వైద్యులు చెప్పారని సదరు మహిళ వాపోయారు.

● కసాపురానికి చెందిన గోవిందమ్మకు నెల రోజుల కిందట కుక్క కరిచింది. ఆసుపత్రికి వెళ్లి సూదులు వేయించుకుంది. ఈమధ్య మళ్లీ కుక్క కరచిన చోట ఇన్‌ఫెక్షన్ కావడంతో ఆసుపత్రిలో చేరింది. వైద్య సిబ్బంది కొన్ని మాత్రలు ఇచ్చి సూదులు వేశారు.



ఓపీ చీటీల కోసం వరుసలో నిలబడిన రోగులు

ఇబ్బందులు రానివ్వం

ఆసుపత్రికి సీటీ స్కానింగ్ మంజూరైంది. రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుంది. తరువాత ఇబ్బందులు ఉండవు. కొన్ని ప్రత్యేకమైన మందుల సరఫరా లేదు. వాటిని బయట తెచ్చుకోవాలని రోగులకు సూచిస్తున్నాం. ఇకపై రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్. అజేంద్రరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి

యాంటిబయాటిక్ సెలైన్లు లేకపోవడంతో బయట తెచ్చుకోవాలని సూచించారు.

సీటీ స్కానింగ్ ఏదీ?

ఏరియా ఆసుపత్రిలో సీటీ స్కానింగ్ సదుపాయం లేకపోవడంతో రోగ నిర్ధారణ కోసం రోగులు ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల అక్తర్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. సీటీ స్కానింగ్ కోసం బయటికి రాసిచ్చారు. నిరుపేద కావడంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఆసుపత్రిలో రోగులను తీసుకెళ్లడానికి వీల్‌ఛైర్లు లేవు.

గురుకులం నిర్వహణ తీరుపై ఆగ్రహం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలను నిర్వహించేది ఇలాగేనా అని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ గురుకుల ప్రిన్సిపల్ విజయలక్ష్మిని నిలదీశారు. శుక్రవారం ఆమె కొర్రపాడు బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో ఆహార నాణ్యత, వసతులు పరిశీలించారు. కోడిగుడ్లు చిన్నగా ఉండటం, ఆకుకూరలు, కూరగాయలు నాణ్యతగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగితే విషపురుగులు వస్తాయని, వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తహసీల్దారు పుణ్యవతి, ఎంపీడీవో తేజోత్స్న, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, ఈవోఆర్డీ దామోదరమ్మ, తెదేపా నాయకులు శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ● కొర్రపాడు బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తనిఖీ చేశారు. పాఠశాలలో క్లినిక్ గదిని పరిశీలించగా, ఈ నెల 30వ తేదీన గడువు తీరే మందులు ఉండటంతో, ఎందుకు ఉంచారని ఏఎన్‌ఎం మాధవీలతను ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలతో ఆటలాడవద్దని సూచించారు. కొద్దిసేపటి తర్వాత ఏఎన్‌ఎం మాధవీలత లోబీపీ కారణంగా కళ్లు తిరిగి పడిపోవడంతో వైద్యశాలకు తరలించారు.



విద్యాలయంలో ఆహార నాణ్యత పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పవన్‌ను కలిసిన జన సైనికులు

గుంతకల్లు: నియోజకవర్గ సమస్యలను ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లామని జనసేనా పార్టీ నాయకుడు పూలరమణ అన్నారు. ఆయన శుక్రవారం విజయవాడలో ఉపముఖ్యమంత్రిని కలిశారు. నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం, దోసలుడికి పంచాయతీలోని బుగ్గసంగమేశ్వరాలయాల ప్రాధాన్యతను వివరించి భక్తుల కోసం మంచి రోడ్లను వేయాలని కోరామన్నారు. స్పిన్నింగ్‌మిల్లును తెరిపించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని విన్నవించామన్నారు. గుంతకల్లు నుంచి దోనిముక్కల, నాగసముద్రం మీదుగా పామిడికి వెళ్లడానికి రెండు వరుసల తారురోడ్డు కావాలని కోరామన్నారు.

తెదేపా కార్యకర్త మృతి

శింగనమల: శింగనమలకు చెందిన తెదేపా సీనియర్ కార్యకర్త సుధాకర్ యాదవ్(40) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది. డ్రైవర్ వృత్తిలో స్థిరపడిన ఈయన కర్ణాటకలో వాహనం నడుపుతో గుండెపోటుకు గురయ్యారు.

చికిత్స పొందుతూ మరొకరు..

యాడికి: క్రిమిసంహారక మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికిలోని కోటవీధికి చెందిన శ్రీనివాసులు(44)కు ఉన్న సొంత వాహనాన్ని బాడుగలకు తిప్పుతుండేవారు. వెన్ను నొప్పి ఉండగా, పలుచోట్ల చికిత్స పొందాడు. గురువారం నొప్పి అధికం కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉన్న క్రిమిసంహారక మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు.

పొలంలో పనిచేస్తూ రైతు..

గుంతకల్లు గ్రామీణం: గుండాల తండాకు చెందిన చందూనాయక్ (55) అనే రైతు శుక్రవారం పొలంలో గుండెపోటుతో మృతి చెందాడు. చందూనాయక్ వ్యవసాయ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో తనకున్న 4 ఎకరాల పొలంలో వ్యవసాయం కోసం 4 బోర్లు వేయించారు. నీరు పడలేదని ,రూ. 8లక్షల వరకు అప్పు ఉందని మనోవేదనకు గురవుతున్నాడని కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం పొలంలో పనులు చేస్తుండగా కుప్పకూలిపోయాడని వాపోయారు.

ఇసుక టిప్పర్ల జప్తు

శింగనమల, న్యూస్‌టుడే : పెద్ద జలాలపురం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను జప్తు చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. వంక నుంచి ఇటాచీతో ఇసుకను తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు తెలిపారు. రెండు టిప్పర్లు, ఇటాచీని స్వాధీనం చేసుకొని అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యల్లనూరు, న్యూస్‌టుడే : యల్లనూరు మండలంలోని గొడ్డుమర్రి గ్రామ సమీపంలో చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు.

● **ఇంట్లో చోరీ :** పాతపల్లె గ్రామంలో లక్ష్మీదేవి అనే మహిళ ఇంట్లో గుర్తు తెలియని కొందరు దుండగులు ఆమె ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న రూ. 60 వేల నగదు, మరికొన్ని వస్తువులను ఎత్తుకెళ్లారు.

చిన్నారిపై కుక్కల దాడి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి ఆర్.ఎస్.లో శుక్రవారం ఓ చిన్నారిపై వీధికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వంకగడ్డ వీధిలో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి ప్రసాద్, భారతి దంపతుల కుమార్తె రోషిణి రామాలయం వీధిలో ఉన్న ట్యూషన్‌కు వెళ్లింది. ఈక్రమంలో పని మీద బయటకు రావడంతో కుక్కలు దాడి చేశాయి.

మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి: తాడిపత్రిలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కాలనీకి చెందిన గజ్జల నరేష్‌కుమార్ అలియాస్ భయంకర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న రూ. 30,240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

చౌకబియ్యం పట్టివేత

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరులోని పరిసర ప్రాంతాల్లో చౌకబియ్యం వాహనాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కొమ్మెపల్లికి చెందిన రాజు, డోన్ ప్రాంతానికి చెందిన నబీరసూలు అనే వ్యక్తులు చౌకబియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం 1350 కిలోలు ఉన్నాయని, ఇద్దరు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు ఎస్సై చిన్నరెడ్డెప్ప తెలిపారు.

సమస్యల వలయంలో.. వసతిగృహం

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

నార్పల, న్యూస్‌టుడే : నార్పల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతిగృహంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ 105 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వసతిగృహం ప్రధాన గేటు దగ్గర విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. దీన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. దీనికితోడు విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే కుళాయిల వద్ద అపరిశుభ్రత నెలకొంది. విద్యార్థులు నిద్రించే గదుల్లో పైకప్పు శిథిలమై పెచ్చులూడుతోంది. విద్యార్థులు భయం భయంగా ఉంటున్నారు. గదుల్లో ఫ్యాన్లు సక్రమంగా తిరగకపోవడంతో రాత్రుళ్లు దోమల పోటు తప్పడం లేదు. ఈ విషయంపై వసతిగృహ సంరక్షకుడు విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా విద్యుత్తు నియంత్రికను త్వరలోనే తొలగిస్తామన్నారు. వసతిగృహంలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు విడుదల కాగానే దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు.



పెచ్చులూడిన వసతి గృహ గది

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

తాడిపత్రి, న్యూస్‌టుడే : ఇంటర్ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ సాయిప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు చిన్నవయస్సులోనే మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారన్నారు. మద్యం, గంజాయి వంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని తెలిపారు. చరవాణులతో కాలం వృథా చేసుకోవద్దండని తెలిపారు.

యువతకు ఉపాధి చూపరూ..

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఎటువంటి పరిశ్రమలు లేని గుంతకల్లులో నిరుద్యోగులకు ఉపాధి చూపడానికి కేంద్ర ప్రభుత్వం రైల్వే విద్యుత్తు లోకోల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఎస్కే యూనివర్సిటీ చరిత్ర ఆచార్యుడు మల్లికార్జున రెడ్డి రైల్వే అధికారులను కోరారు. ఆయన శుక్రవారం డీఆర్‌ఎం కార్యాలయానికి వచ్చి డీఆర్‌ఎం విజయకుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై దిల్లీ వెళ్లి రైల్వే మంత్రితో పాటు రైల్వేబోర్డు ఛైర్మన్‌ను కలిసి వినతిపత్రాలను అందజేస్తామన్నారు. వినతిపత్రాన్ని రైల్వేబోర్డుకు పంపాలని ఆయన డీఆర్‌ఎంను కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య : పాత చెదుల్ల గ్రామంలో నెల రోజులుగా పారిశుద్ధ్య పనులు చేయడం లేదు. **-నారాయణస్వామి, పాత చెదుల్ల**
సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **-శ్రీనివాసప్రసాద్, గ్రామ కార్యదర్శి** -న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం
సమస్య: గుంతకల్లులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ఆటోలు ఆపుతున్నారు. దీని వల్ల అంబులెన్స్ రావడానికి ఇబ్బందిగా ఉంది. **- రాజు, స్థానికుడు**
సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **- రామప్రసాద్, ఏవో, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి** -న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని పుట్లూరు రోడ్డులో ఉన్న కస్తూర్బా జనరల్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు- వాటి నివారణ చర్యలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.



పోటీల్లో విద్యార్థినులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

తాడిపత్రి, న్యూస్‌టుడే: వసతిగృహంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరికి చేరవని తెదేపా మున్సిపల్ కౌన్సిలర్ మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని, వీటిని అరికట్టాలని పరిసరాలను పనరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. వసతిగృహ వార్డెన్ సువర్ణరెడ్డి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

గుత్తి : వందల ఏళ్ల చరిత్ర ఉన్న గుత్తిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పలువురు కోరారు. కోటలోని చారిత్రక కట్టడాలు శిథిలమవుతున్నాయని వాపోయారు. శుక్రవారం కోట సంరక్షణ సమితి అధ్వర్యంలో ప్రపంచ పర్యాట దినోత్సవాన్ని కోట ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, సురేష్‌గౌడు, హెచ్.ఎం. సుబహాన్ కోటగైడు రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేశేపల్లిలో పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

నార్పల: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం 'ఈనాడు'లో 'మురుగు పరుగు.. పట్టించుకునేదెవరు..?'' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎంపీడీవో దివాకర్, ఈవోఆర్డీ శైలజారాణి శుక్రవారం ఉదయాన్నే కేశేపల్లికి గ్రామానికి వెళ్లి మురుగు తొలగించి గ్రామంలో బ్లీచింగ్ పొడి చల్లించారు.

రెండు బస్సుల ఢీ.. డ్రైవర్ దుర్మరణం

నర్సాపూర్ : ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో తాడిపత్రికి చెందిన డ్రైవర్ నాగరాజు(46) మృతి చెందాడు. మరో డ్రైవర్‌తో పాటు దాదాపు 30 మంది విద్యార్థులు, అధ్యాపకులకు గాయాలైన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. నాగరాజుది తాడిపత్రి కాగా పటాన్ చెరులో స్థిరపడ్డాడు.

భక్తిశ్రద్ధలతో మస్తాన్‌వలి ఉరుసు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని చాగల్లు గ్రామంలో మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గంధం ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి గ్రామ సమీపంలో వెలసిన మస్తాన్‌వలి దర్గాకు గంధాన్ని తరలించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించారు.



గంధం ఉత్సవంలో భక్తులు

విద్యుత్తు శాఖ ఏఈగా విజయ్‌కుమార్ బాధ్యతలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె మండల విద్యుత్తుశాఖ ఏఈగా విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రెండేళ్లుగా ఇక్కడ శాశ్వత ఏఈ లేక రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం నూతన ఏఈగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సిబ్బంది, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విశ్రాంత రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంతకల్లు, న్యూస్‌టుడే : అఖిలభారత విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య విశ్రాంత ఉద్యోగులు, పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషిచేస్తోందని సమాఖ్య గుంతకల్లు డివిజన్ కార్యదర్శి సుంకప్ప అన్నారు. సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం సమాఖ్య కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఉప తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

యాడికి, న్యూస్‌టుడే: యాడికి మండల ఉప తహసీల్దార్‌గా శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బాలమ్మ ఆత్మకూరుకు బదిలీ కాగా, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి శ్రీనివాసులు ఇక్కడికి బదిలీపై రావడం జరిగింది.

పైపులైను గుంతలు పూడ్చండి

గుంతకల్లులోని హౌసింగ్ బోర్డు కాలనీలో తాగునీటి పైపులైను పనుల చేపట్టి మట్టిని రోడ్డుపై వేశారు. ఇది రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయమై మున్సిపల్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా పైపులైను పనులను పూర్తి చేయించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం



అక్కరకురాని మరుగుదొడ్లు

గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని పాత భవనాల్లో ఓపీ గదులకు మరమ్మతుల చేపట్టారు. అందులో భాగంగా పురుషులకు చెందిన మరుగుదొడ్లకు తలుపులు తొలగించి పక్కన పెట్టేశారు. ఏడాది కావస్తున్నా వాటిని మరుగుదొడ్లకు బిగించలేదు. దీంతో అవన్నీ నిరుపయోగంగా మారాయి.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం



రక్షణ కరవు.. ప్రయాణం బరువు



గార్లదిన్నె నుంచి యర్రగూతలకు వెళ్లే దారిలో సుమారు అరకిలోమీటరు రహదారి ఎంపీఆర్ కాలువ పక్కగా వెళ్తుంది. ఈ కాలువ పక్కన రహదారికి ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవటంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈమార్గంలో ఆయా గ్రామాల నుంచి గార్లదిన్నెతో పాటు అనంతపురం నగరానికి వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. -చిత్రం : ఈనాడు, అనంతపురం, గార్లదిన్నె గ్రామీణం

పట్టపగలే రెండిళ్లల్లో చోరీ

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని మారుతీ నగర్‌లో శుక్రవారం పట్టపగలు రెండిళ్లల్లో చోరీ జరిగింది. దుండగులు ఇళ్లకు తాళం వేసి ఉండటాన్ని గమనించి పథకం ప్రకారం చోరీ చేశారు. రెండిళ్లల్లో 25 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ. 5వేల నగదును ఎత్తుకెళ్లారు. రాంబాబు, రవి ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఉదయం ఇళ్లకు తాళాలు వేసి విధులకు వెళ్లి భోజన విరామ సమయంలో వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి బీరువాలను చూశారు. రవి ఇంటిలో 20 తులాల వెండి ఆభరణాలతోపాటు ఏటీఎంకార్డులను ఎత్తువెళ్లారు. రాంబాబు ఇంట్లో 5 తులాల వెండితోపాటు రూ. 5 వేలు నగదు చోరీకి గురైంది. బీరువాలను పగుల గొట్టి అందులోని వెండి, నగదును చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురపాలికల్లో దోమల విజృంభణ

☛ వినియోగంలో లేని ఫాగింగ్ యంత్రాలు ☛ రోగాల బారిన ప్రజలు

పురపాలిక -	జనాభా- వార్డులు-	పనిచేయని యంత్రాలు
గుత్తి-	55 వేలు 25	3
తాడిపత్రి-	1.30 లక్షలు 36	3

గుత్తి, తాడిపత్రి, న్యూస్‌టుడే : గుత్తి, తాడిపత్రి పురపాలికల్లో దోమల నివారణకు వినియోగించే ఫాగింగ్ పరికరాలు మూలకు చేరాయి. రూ. లక్షలు వెచ్చించి వృథాగా మార్చారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. తద్వారా కాలానుగుణ వ్యాధులు ప్రబలుతున్నాయి. జనం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

● క్షేత్రస్థాయిలో ప్రజలు రోగాలతో సతమతమవుతున్నా దోమల నివారణకు పురపాలిక అధికారులు ఫాగింగ్ చేయించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాధులను కట్టడి చేయండని ఉన్నతాధికారులు స్థానిక కమిషనర్లకు ఆదేశాలు ఇస్తున్నా పట్టించుకోవడంలేదు. గుత్తి, తాడిపత్రి పురపాలికల్లో కనీసం నెలకోసారికూడా ఫాగింగ్ చేయించలేకపోతున్నారు. ఫాగింగ్ చేయించాలని కౌన్సిలర్లు కోరుతున్నా అధికారుల్లో చలనం రావడం లేదు.

● గుత్తి, తాడిపత్రి పట్టణాల్లో ఫాగింగ్ యంత్రాలకు పని లేకుండా పోయింది. గుత్తిలో గతనెలలో రూ. 50 వేలు వెచ్చించి కొత్త యంత్రాన్ని కొనుగోలు చేశారు. అంతకు ముందు కొనుగోలు చేసిన రెండు యంత్రాలు పనిరాకుండా పోయాయి. 13 ఏళ్ల కిందట గుత్తి, చెట్నేపల్లి మేజర్ పంచాయతీలుగా ఉన్నపుడు ఉన్న ఫాగింగ్ యంత్రాలు ఏమయ్యాయో తెలియడం లేదు. తాడిపత్రి పురపాలికలో ఐదు యంత్రాలు ఉండగా కేవలం మూడు మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన రెండింటికి మరమ్మతులు చేయించలేదు.

వినియోగంలోకి తెస్తాం

పని చేయని ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయిస్తాం. వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. ఇంధనం లేక యంత్రాలను ప్రతిరోజు వినియోగించలేకపోతున్నాం. ఇకపై అప్రమత్తంగా ఉంటాం.

-నెట్టికల్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుత్తి



గుత్తిలో పురపాలిక స్టోర్ గదిలో ఉన్న ఫాగింగ్ యంత్రాలు

ఉద్యోగ మేళాకు స్పందన

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన వచ్చింది. కళాశాలల కరస్పాండెంట్ ప్రభాకర్, వివిధ కంపెనీల ప్రతినిధులు సమక్షంలో ఉద్యోగ మేళాలో 82 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ తెలిపారు. అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు


ప్రత్యేక అలంకరణలో లలిత శివకామేశ్వరస్వామి

శివకోటిలో శరన్నవ రాత్రులకు విశేష అలంకారాలు

అనంత సాంస్కృతికం: శివకోటి శ్రీపీఠంలో శరన్నవ రాత్రులను పురస్కరించుకొని ఆలయంలో వెలసిన శివకామ సుందరి, శివకామేశ్వరస్వామి వార్లకు విశేష అలంకరణలు నిర్వహించనున్నారు. అక్టోబరు 3 నుంచి 12 వ తేదీ వరకు రోజుకో అలంకారం ఉంటుంది. 10 రోజుల పాటు జరిగే పూజల్లో ఒక రోజు, మహార్నవమి రోజున రుద్ర, చండీయాగాలు, పది రోజుల మహాపూజ జరపాలనుకునే భక్తులు ఆలయంలో సంప్రదించాలని ఆలయం మేనేజరు విజ్ఞప్తి చేశారు.

వ్యాధి నయం కాక మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: వ్యాధి నయం కాలేదనే మనస్తాపంతో యాసిడ్ తాగిన వృద్ధురాలు. . చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం దిగువ పల్లికి చెందిన సరితల మాబు కుటుంబం జీవనోపాధి నిమిత్తం పదిహేనేళ్ల క్రితం అనంతపురం నగరానికి వచ్చి రుద్రంపేట పంచాయతీలోని విశ్వశాంతినగర్‌లో ఉంటున్నారు. అతని తల్లి కుల్లాయమ్మ (75) ముప్పై ఏళ్లుగా మొలల సమస్యతో బాధపడుతోంది. పలుచోట్ల చికిత్స చేయించినా నయం కాకపోగా, సమస్య మరింత తీవ్రమైంది. వృద్ధురాలు తీవ్ర మనస్తాపానికి గురైంది. గురువారం ఇంట్లో స్నానాల గదిలోకి వెళ్లి యాసిడ్ తాగింది. అనంతరం గట్టిగా కేకలు వేసి విషయం చెప్పింది. ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది.

తప్పిపోయిన బాలిక అప్పగింత

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: తప్పిపోయిన బాలికను పోలీసులు వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. అనంతపురం మొదటి రోడ్డు శివాలయం సమీపంలో నవీన్, సౌమ్య దంపతులు నివాసముంటున్నారు. సౌమ్య స్థానిక రుద్రంపేటలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. తల్లితోపాటు వెళ్లిన ఆరేళ్ల కుమార్తె తన్వి శుక్రవారం సాయంత్రం స్థానిక రుద్రంపేటలోని శ్రీచైతన్య పాఠశాల సమీపంలో ఆడుకుంటూ తప్పిపోయింది. అరగంటైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది పలుచోట్ల గాలించారు. రుద్రంపేట కూడలిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న నాలుగో పట్టణ ఎస్సై రాంప్రసాద్‌కు విషయాన్ని తెలియజేశారు. ప్రాథమికంగా ఆ పరిసరాల్లో పోలీసులు విచారించగా, ఆ చిన్నారిని అదే ప్రాంతంలో సైకిల్ తొక్కుతున్న మరొక బాలుడి వెంట వెళ్లినట్లు తేలింది. సమాచారం ఎస్పీ జగదీశ్‌కు చేరింది. తక్షణమే అన్ని పోలీసుస్టేషన్లు, బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలను సైతం రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టారు. రుద్రంపేట, రాంనగర్ ప్రాంతాల్లో గాలించారు. ఎట్టకేలకు రుద్రంపేట ప్రాంతంలోని ఓ ఇంట్లో ఉండటాన్ని గమనించి చిన్నారిని పట్టుకున్నారు. తమ కుమార్తె చెంతకు చేరడంతో హర్షం వ్యక్తం చేశారు.

కొద్దిపాటి వర్షం.. నిత్యం మురుగు కష్టం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షానికే రోడ్ల పక్కనే దుర్వాసన భరించలేనంతగా వస్తోంది. అంతర్గత రోడ్లు ఛిద్రం కావడం, నీరు నిలిచి వాహనదారులకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఆదివారం రాత్రి, సోమవారం సాయంత్రం, మంగళవారం, బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల మీద నీరు నిలిచి ఇబ్బందికర పరిస్థితులు కొనసాగుతున్నాయి.


శ్రీకంఠం కూడలి సమీపంలో కమలానగర్, సప్తగిరి కూడలి, రాంనగర్, గుల్జార్‌పేట, వినాయకనగర్‌లో మురుగు, వర్షం నీరు ఏకం అవుతున్నాయి. చిన్న వర్షం వస్తే చాలు మురుగు రోడ్లు మీదకు వచ్చేస్తోంది.

చెత్తకుండీల వద్ద కంపు

నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్త బిన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 140 మెట్రిక్ టన్నులు చెత్త బిన్లు, ఇంటింటా క్లాప్ ఆటోల ద్వారా చెత్త సేకరిస్తారు. నగరంలో 296 చెత్త బిన్లు వద్ద చెత్తను వేసి అనంతరం తరలించే ప్రక్రియను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో చెత్తను తరలించినా వర్షం వస్తే చాలు ఆయా ప్రాంతాలు అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. చుట్టూ కంపు కొడుతున్నా కనీసం బ్లీచింగ్ పౌడరు చల్లకుండా వదిలేస్తున్నారు. పాతూరు చెన్నకేశవ దేవాలయం ముందు భాగాన చెత్త కుప్పగా వేసి తరలించి అనంతరం వదిలేయగా ఆ ప్రాంతం అంతా దుర్వాసన వస్తుంది. ఇలాంటివి నగరంలోని మార్కెట్ వద్ద రెండు, రాణినగర్, పవర్ ఆఫీసు వద్ద, పలు పాఠశాలల సమీపంలో ఇబ్బందికరంగా ఉంది. ఆయా ప్రాంతాల ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది.


పాతూరు తాడిపత్రి బస్టాండ్ వద్ద రోడ్డు పక్కనే

అంతర్గత రోడ్లు చిత్తడి



అంతర్గత రోడ్లు నిత్యం చిత్తడిగా ఉంటున్నాయి. నివాసాల మధ్య ఉండటంతో ప్రజలు దోమలతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. నీరు నిల్వ ఉంటుండటంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం నెలకొంది. త్రివేణి థియేటర్ రోడ్డు ఆదరణ రెసిడెన్సీ ముందు భాగాన సిమెంటు రోడ్డు కంకర తేలి గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షానికి నీరు నిలబడుతోంది. భాగ్యనగర్, నారాయణరెడ్డి కాలనీ, రాంనగర్, హౌసింగ్ బోర్డు శివారు, విజయనగర్ కాలనీ ప్రధాన రోడ్డు, శారదానగర్, ఎస్‌బీఐ కాలనీల్లో అంతర్గత రోడ్లు దారుణంగా ఉన్నా మరమ్మతులు చేయకుండా వదిలేశారు. నీటి నిల్వతో గుంతలు అంతకంతకు పెరుగుతున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: వై.కొత్తపల్లి సమీపంలోని శ్రీ మలహోబుల లక్ష్మీనరసింహస్వామి ఆలయ కోనేరులో చెత్త చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి.

- రాము, భక్తుడు

సమాధానం: వెంటనే తొలగించి మరోసారి చెత్త పడకుండా ఉండేందుకు కోనేరుపై గ్రిల్ ఏర్పాటు చేయిస్తాం.

- నరసింహా రెడ్డి, ఆలయ ఈవో. - న్యూస్‌టుడే, ఆత్మకూరు,

పిచ్చిమొక్కలు తొలగించి ఉద్యానంలా మార్చారు

స్పందనకు వందనం


పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేసిన ఉద్యానం

నగరంలోని కోవూరు నగర్‌లో ఉన్న ఉద్యానంలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ నెల 15న ఈనాడులో 'పిచ్చి మొక్కల వనం' శీర్షికతో చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. ఉద్యానంలోని పిచ్చి మొక్కలు, మద్యం సీసాలు, వ్యర్థాలు తొలగించడంతో చిన్నారులు అందులోకి వెళ్లడానికి అవకాశం ఏర్పడింది.

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక

వీధి దీపాలకు మరమ్మతు

మేమున్నాం.. మీకు తోడుగా శీర్షిక కింద రుద్రంపేట-ఆలమూరు రోడ్డులో వీధి లైట్లు వెలగడం లేదన్న సమస్యకు అధికారులు పరిష్కారం చూపారు. స్పందించిన పంచాయతీ అధికారి మల్లికార్జున రెడ్డి వీధిదీపాలు మరమ్మతులు చేయించారు.


గ్రామీణ సబ్ రిజిస్ట్రార్ శ్రీరాములకు స్వాగతం పలుకుతున్న దస్తావేజుల సంఘం సభ్యులు


అనంతపురం అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ యూనస్‌ను అభినందిస్తున్న సిబ్బంది

సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా ఎండీ యూనస్, గ్రామీణ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీరాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాల జరిగిన బదిలీల్లో వారిని అనంతపురానికి నియమించారు. శింగనమల సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న యూనస్‌ను అనంతపురం అర్బన్ జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. గతంలో ఆయనను ఒకసారి అనంతపురం అర్బన్‌కు బదిలీ చేసినా వివిధ కారణాల వల్ల బాధ్యతలు చేపట్టలేదు. తాజా బదిలీల్లో ఆయన్ను మళ్లీ అనంతపురం అర్బన్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఇస్మాయిల్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. పలువురు సిబ్బంది యూనస్‌ను స్వాగతం పలికారు. అనంతపురం గ్రామీణ సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీరాములు బాధ్యతలు స్వీకరించారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారిని వరలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రీన్‌కో సహకారంతో పాఠశాలలో రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ని పరిశీలించారు.

వసతిగృహాల సమస్యలపై నిరసన.. ఉద్రిక్తం


నిరసనను అడ్డుకుంటున్న సీఐతో ఏఐఎస్ఎఫ్ నేతలు వాగ్వాదం

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై నిరసన తెలిపేందుకు వచ్చిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. వసతి గృహాల్లో లేని వారంతా వెళ్లిపోవాలని సమస్య ఉన్న వసతి గృహంలోని విద్యార్థులు మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. మరోవైపు ఎస్సీ వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలపై నిరసన చేసేందుకు వారే వచ్చారా? అంటూ దళిత, ఎస్సీ సంఘాల నేతలు మరో వైపు నిరసన వ్యక్తం చేశారు. కాసేపు అనంతపురంలోని సాంఘిక సంక్షేమ సంచాలకుల కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ధర్నా కాకుండా కేవలం వినతి పత్రం ఇవ్వడానికి మాత్రమే అనుమతి ఇస్తామని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ స్పష్టం చేశారు. ఏఐఎస్ఎఫ్ సంఘం నేతలు సీఐతో వాగ్వాదానికి దిగారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుల్లాయిస్వామిలు మాట్లాడుతూ.. ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు ఇవ్వాలని, విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు దూరంగా ఉన్న హౌసింగ్ బోర్డులోని వసతి గృహం మరో ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు.

విధుల్లోకి ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు

అనంత నేరవార్తలు: ఉమ్మడి జిల్లాకు కొత్తగా నియమించిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉన్నతాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామిలు జిల్లా కేంద్రంలోని ప్రకాశ్‌రోడ్డులో ఉన్న డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో వేర్వేరుగా వారి ఛాంబర్లలో బాధ్యతలు తీసుకున్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డీసీ, ఏసీలు జిల్లా ఎస్పీ జగదీశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీసత్యసాయి జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బి.నరసింహులు పుట్టపర్తిలో బాధ్యతలు స్వీకరించారు.

క్రమశిక్షణతో వ్యవహరిస్తే ఉత్తమ భవిత

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 2, 4ను పరిశీలించారు. విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. వసతి గృహాల్లో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్


డ్యాన్స్ చేస్తున్న కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

ఉత్సాహంగా స్వాగతోత్సవం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ శంకరయ్య విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగిస్తూ చదువుతో పాటు వినోదం కూడా అవసరం. అయితే క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు.

ఆర్థిక వ్యవస్థలో పర్యాటకరంగం కీలకం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: మనదేశ ఆర్థిక వ్యవస్థలో పర్యాటక రంగం కీలకపాత్ర పోషిస్తోందని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ శంకర్ నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్స్ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. మన దేశం ఘనమైన వారసత్వ సంపద కలిగి ఉందన్నారు. విదేశీయులను ఆకర్షించే పర్యాటక ప్రదేశాలు దేశంలో ఉన్నాయన్నారు.

ఈవో బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నూతన కార్యనిర్వహణ అధికారిగా బాబు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గార్లదిన్నె మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ఈవోగా పని చేస్తున్న బాబు పంపనూరుకు రాగా ఇక్కడ పని చేస్తున్న అక్కిరెడ్డి అనంతపురంలోని గ్రూప్-4 ఆలయాలకు ఈవోగా బదిలీపై వెళ్లారు. నూతన ఈవోకి స్వాగతం పలికి బదిలీపై వెళ్లిన ఈవోని సత్కరించారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులను నియంత్రించాలంటే ప్రతీ ఒక్కరూ మహిళా రక్షణ చట్టాలపై అవగాహన అవసరమని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఎస్సై, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు సిబ్బందితో కలిసి మహిళా చట్టాలు, చిన్నారుల రక్షణ చట్టాలు (పోక్సో), సైబర్‌నేరాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని వివరించారు.

కుక్కల బెడద ఇంకెన్నాళ్లు?



అనంతపురం నగరంలో వేల సంఖ్యలో కుక్కలు ఉన్నా అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోలేదు. ఉదయం పిల్లలను స్కూళ్లకు వదిలేందుకు బయల్దేరిన తల్లిదండ్రులకు కుక్కల గుంపులు ఎదురుగా వస్తుంటే వణుకు పుడుతోంది. అన్ని ప్రాంతాల్లో కుక్కల బెడదతో అల్లాడుతున్నారు. రామ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ శ్రీనగర్ కాలనీలో పరిస్థితి భయానకంగా ఉంది.

- న్యూస్‌టుడే, రుద్రంపేట

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం



రుద్రంపేట పంచాయతీ పరిధి చంద్రబాబు నగర్ సమీపాన మురుగునీటి కాలువలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. మురుగు నీటి కాలువలో ఉన్నందున విద్యుత్తు సార్ట్‌సర్క్యూట్ జరిగితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని మరోచోట్లుకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రుద్రంపేట

తిండి తినడానికీ నీడ లేదు



అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు పశువులు, గొర్రెల సంతలో 2 నెలల క్రితం షెడ్డు కున్న ఇనుప స్తంభాలు దెబ్బతిని కూలింది. మరమ్మతులు చేయకుండా యార్డు అధికారులు వదిలేశారు. ఈ షెడ్డు కింద గతంలో రాయితీ భోజనం పెట్టేవారు. ప్రతి శని, ఆదివారాలు సంతల్లో రోజుకు 300-400 మంది రైతులు, వ్యాపారులు షెడ్డు నీడన భోజనం చేసేవారు. రైతులు, కాపర్లు, వ్యాపారులంతా మధ్యాహ్న సమయం సేదుతీరేవారు. ప్రస్తుతం షెడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, అనంత మార్కెట్‌యార్డు

'కార్యదర్శుల విలీనం అశాస్త్రీయం'

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులను పంచాయతీరాజ్ శాఖలో విలీనం చేయడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామ కార్యదర్శుల సంఘం రాష్ట్ర నాయకుడు వర్ల శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. అశాస్త్రీయంగా వారిని విలీనం చేయడం వల్ల వచ్చే నెలలో ప్రతి మండలంలో ఇద్దరు లేదా ముగ్గురు పంచాయతీ కార్యదర్శులకు జీతాలు లేని పరిస్థితి ఎదురవుతుందని ఆయన తెలిపారు. గ్రేడ్-5 కార్యదర్శులను ఎంపీడీఓల లాగిన్‌లో చేర్చడం వల్ల అనేక మండలాల్లో జీతాలు రాని పరిస్థితి ఉందన్నారు. ఉన్నతాధికారులు అవగాహన లేకుండా ఆ కార్యదర్శులను విలీనం చేయడం వల్ల 10 నుంచి 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న గ్రామ కార్యదర్శులకు జీతాల కష్టాలు తప్పవన్నారు. అధికారులు స్పందించి సచివాలయ కార్యదర్శుల విలీనాన్ని శాస్త్రీయంగా చేపట్టాలని డిమాండ్ చేశారు.

బాధితులకు అండగా ప్రభుత్వం


పత్రాలు, చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే : దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్న బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శుక్రవారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి పత్రాలు, చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. బాధితుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెద్ద జబ్బుల బారిన పడి ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షలు వెచ్చించి వైద్యం చికిత్సలు చేయించుకుంటున్న పేదలకు వైద్య ఖర్చులు అందించి, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

హామీలు అమలు చేయలేక రాజకీయాలా?

అనంతపురం (రాణినగర్), న్యూస్‌టుడే: వంద రోజుల్లో ఏవిధమైన హామీలను అమలు చేయలేక చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ తిరుమల పర్యటన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న 30 యాక్ట్ అమలు పేరుతో వైకాపా నేతలను అడ్డుకోవడం తగదన్నారు.

చంద్రబాబు పాలనతోనే దళితులకు న్యాయం


జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, చిత్రంలో ఎస్పీ జగదీష్

రుద్రంపేట, న్యూస్‌టుడే: గతంలో ఎస్సీ వర్గీకరణ చేసి, సామాజిక న్యాయం చేసింది చంద్రబాబేనని, ఇప్పుడు కూడా మాదిగలకు వర్గీకరణ చేసేది చంద్రబాబుతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరు పోగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడుకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో నిర్వహించిన కృతజ్ఞత యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి యాత్ర ప్రారంభించారు. గడియార స్తంభం నుంచి సుభాష్ రోడ్డు, సప్తగిరి కూడలి మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీశ్‌లకు చంద్రబాబు నాయుడుకు తెలిపే కృతజ్ఞత యాత్ర పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, రాష్ట్ర నాయకులు మద్దిలేటి, రామాంజి జిల్లా నాయకులు నాగరాజు, రామాంజినప్ప, ఓబులేసు, ఆంజనేయులు, ముత్యాలు, ఆదిశేషు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు స్థలపరిశీలన


ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అనితతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా మంత్రిత్వశాఖ అధికారి ప్రసాద్‌రెడ్డి తదితరులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: యువతకు ఉద్యోగ నైపుణ్య సాంకేతిక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడానికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా మంత్రిత్వశాఖ అధికారులు ఎస్కేయూలో స్థలాలు పరిశీలించారు. పై మంత్రిత్వశాఖ డిప్యూటీ జనరల్ మేనేజరు ప్రసాద్ రెడ్డి శుక్రవారం ఎస్కేయూలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్, వర్సిటీలోని స్థలాలను పరిశీలించారు. ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య అనితతో చర్చించారు. ఈ శిక్షణ కేంద్రంలో వెయ్యి మందికి, దశల వారీగా 3 వేల మందికి నైపుణ్య శిక్షణ అందించడానికి ప్రణాళిక రూపొందించామని ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పారిశ్రామిక శిక్షణ కేంద్రానికీ..

ఎస్కేయూ, న్యూస్‌టుడే: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలలో పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సంబంధిత అధికారులు స్థలపరిశీలన చేశారు. మంత్రిత్వశాఖ డిప్యూటీ జనరల్ మేనేజరు ప్రసాద్‌రెడ్డి, కలెబవ్ ప్రిన్సిపల్ జయచంద్రారెడ్డితో కలసి శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించారు.


నీరు అడుగంటి బోసిపోయిన పి.యాలేరు చెరువు

చినుకు రాలక.. నీరు అందక

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గత నెల రోజులుగా సరైన వర్షం లేక పంటలు ఎండుముఖం పట్టాయి. మండలంలోని పి.యాలేరు చెరువు కింద దాదాపు 220 ఎకరాల వరకూ వరిపంటను సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు లేక చెరువులో నీరు పూర్తిగా తగ్గిపోయింది. పి.యాలేరు చెరువుకు ఆత్మకూరు చెరువులో నుంచి వర్షపు నీరు రావాల్సి ఉంటుంది. ఈ ఏడాది వర్షాలు సరిగా లేక చెరువులోకి నీరు తక్కువగా వచ్చింది. ఇలానే ఉంటే మరో నెల రోజుల్లో పూర్తిగా ఎండిపోతుంది. మండల వ్యాప్తంగా దాదాపు 3142 హెక్టార్ల వరకూ రైతులు సాగు చేశారు. పంట కోత దశ ప్రారంభ సమయంలో వర్షం లేక దిగుబడి పూర్తిగా దగ్గనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.


ఎండిన ఆముదం పంట

పగలే వెలుగులు.. బిల్లులు మోపెడు

ఆత్మకూరు, న్యూస్‌టుడే

సమస్య : పగలే వెలుతున్న వీధి దీపాలు. రాప్తాడు నియోజక వర్గం వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి. వెరసి విద్యుత్తు బిల్లులు ఎక్కువవుతున్నాయి. కనీసం ప్రత్యేక ప్రణాళిక తయారీకి చొరవ చూపడం లేదు.

ఎన్ని మండలాల్లో : రాప్తాడు, ఆత్మకూరు

పంచాయతీలు: ఆత్మకూరు 17 పంచాయతీల్లో, రాప్తాడు 222 పంచాయతీల్లో

వస్తోన్న బిల్లు: సగటున ఏడాదికి ఒక్కో పంచాయతీకి రూ.80 వేల నుంచి 3 లక్షల వరకూ

ఎంతవరకు ఆదా చేయచ్చు : నెలకు ఒక్కో పంచాయతీ ఏడాదికి రూ.16 వేల నుంచి రూ.లక్ష 20 వేల వరకు ఆదా చేయచ్చు.. రెండు మండలాలకు కలిపి మొత్తంగా చూస్తే ఏడాదికి రూ. కోటి వరకు ఆదా చేయవచ్చు.

ప్రస్తుత స్థితి : ఆత్మకూరు, రాప్తాడు పరిధిలో నేటి వరకూ రూ 2కోట్ల 30లక్షల దాకా విద్యుత్తు బకాయిలు ఉన్నాయి. తాగునీటి మోటార్ల బిల్లు కాకుండా కేవలం వీధి దీపాల బిల్లులే దాదాపు రూ. కోటి దాకా ఉంటుంది. అధికారులు స్పందించి పగలు వీధి దీపాలు వెలగకుండా చేయాల్సి ఉంది.


ఆత్మకూరులో వెలుగుతున్న వీధిదీపం

ప్రధాన కారణం

వైకాపా పాలనలో విద్యుత్తు తీగల సరఫరా కొరత కారణంగా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయలేకపోయారు. గత ఐదేళ్లలో రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో దాదాపు రూ. 2 కోట్లు అనవసరంగా విద్యుత్తు బిల్లు చెల్లించారు. విద్యుత్తు నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేసి ఉంటే కనీసం రూ.50 లక్షలు కూడా ఖర్చు అయ్యేది కాదు.

ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తాం

మండలాల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వీధి దీపాలను పగలు వెలగకుండా ఉండేందుకు స్విచ్ బోర్డులను గతంలో ఏర్పాటు చేశారు. అవి దెబ్బతినడంతో ప్రతి వీధిదీపానికి ఒక స్విచ్‌ని అమర్చారు. వర్షాలకు అవి తరచూ దెబ్బతింటూ ఉండటంతో వీధి దీపాలకు స్విచ్‌లు లేకుండా నిత్యం వెలిగేలా ఏర్పాటు చేశారు. విద్యుత్తు శాఖ సాయంతో ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి గ్రామానికి కొన్ని ప్రాంతాల్లో నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. పగలు వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. - **దామోదర రెడ్డి, ఈవోఆర్‌డీ, ఆత్మకూరు**

అనుమానాస్పద మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం ఆలమూరు గ్రామానికి చెందిన జెన్నే లక్ష్మన్న (35) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. లక్ష్మన్న ఉదయం బహిర్భూమికి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆలమూరు బస్టాపు వద్ద ఉన్న గంగమ్మ ఆలయం వద్ద స్పృహ తప్పి పడి ఉండటం గమనించి భార్య శాంతికి సమాచారం ఇచ్చారు. ఆమె స్థానికులతో కలిసి నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు అనంత గ్రామీణం పోలీసులు కేసు నమోదు చేశారు.